మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 13-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 134 Issue: 134

13 నవంబర్ 2025 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:23 సూర్యాస్తమయం - సా. 5:36 తిథిః నవమి రా. 11:37 వరకు తరువాత దశమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం మఖ రా. 7:38 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం బ్రహ్మ ఉ. 6:49 వరకు కరణం తైతుల ఉ. 11:14 వరకు గరజి రా. 11:37 వరకు వర్జ్యం తె. 4:12 నుండి తె. 5:55 వరకు దుర్ముహూర్తం మ. 2:37 నుండి మ. 3:22 వరకు మ. 2:37 నుండి మ. 3:22 వరకు రాహుకాలం మ. 1:24 నుండి మ. 2:48 వరకు యమగండం ఉ. 6:23 నుండి ఉ. 7:47 వరకు గుళికాకాలం ఉ. 9:12 నుండి ఉ. 10:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:47 నుండి తె. 5:35 వరకు అమృత ఘడియలు సా. 5:21 నుండి రా. 7:01 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




## తెలంగాణ నుంచి సివిల్స్ ఇంటర్వ్యూకు 43 మంది

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (మెయిన్స్) పరీక్ష ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు హవా కొనసాగించారు. దేశవ్యాప్తంగా ఆగస్టు 22 నుంచి 31 వరకు జరిగిన మెయిన్స్‌లో మొత్తంగా 2,736 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూ లేదా పర్సనాలిటీ టెస్ట్ రౌండ్‌కు ఎంపికైనట్లు యూపీఎస్సీ ప్రకటించింది.

న్యూఢిల్లీ: ఈ మేరకు మెయిన్స్ రాత పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థుల రోల్ నంబర్లు, పేర్లతో వేర్వేరుగా జాబితాలను వెబ్ సైట్‌లో అందుబాటు లో ఉంచింది. ఇందు లో 43మంది అభ్యర్థులు తెలంగాణ నుంచి ఉన్న ట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. గత ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన 140 మంది అభ్యర్థులు రూ.లక్ష చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక తరువాయి 2 వ పేజీలో...



## సెక్రటేరియట్‌లో 134 మంది ట్రాన్స్‌ఫర్

తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వం భారీగా బదిలీలు చేపట్టింది. చాలా కాలంగా ఒకే డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం కలిగించింది. మొత్తం 134 మంది అధికారులను బుధవారం బదిలీ చేసింది. అడ్మినిస్ట్రేటివ్ సంస్కరణల్లో భాగంగా భారీ స్థాయిలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లను బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): ఈ అధికారులంతా 12 ఏళ్లుగా ఒకే విభాగంలో పనిచేస్తుండటం గమనార్హం. కొన్ని శాఖల్లో అధికారుల కొరత ఉండగా, మరికొన్ని శాఖల్లో అధిక సిబ్బంది ఉన్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు తెలిసింది. ఈ బదిలీలు సచివాలయంలోని వివిధ శాఖల్లో పనిభారాన్ని సమతుల్యం చేయడానికి కూడా దోహదపడనున్నాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి.



## 56వ సారి ఢిల్లీకి రేవంత్

**నేడు అమెరికా-భారత్ ఫోరానికి హాజరు**

**కేంద్ర మంత్రులు, అధిష్ఠానంతో భేటీ!**

**సగటున 12 రోజులకు ఓసారి హస్తినకు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీకి వెళ్లారు. బుధవారం రాత్రి 7 గంటలకు హస్తినకు బయల్దేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా రేవంత్ రెడ్డి భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరంలో పాల్గొననున్నారు.

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): అంతేకాకుండా పలు కీలక సమావేశాల్లో పాల్గొనబోతున్నారని, కేంద్ర మంత్రులతో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో, కాంగ్రెస్ జాతీయ నేతలను - 2 వ పేజీలో...

## కమలంసేన... నిర్వేదం

జూబ్లీహిల్స్ ఎగ్జిట్ పోల్స్‌తో నిరాశ

బీజేపీ కార్యకర్త మదిలో మాట:

**2023 ఎన్నికలకు కొన్ని నెలల ముందు..**

బీఆర్ఎస్ పని ఖతం. కాంగ్రెస్ మనకు దరిదాపుల్లో కూడా లేదు. బీజేపీ అధికారంలోకి రావడం పక్కా. కమలం పార్టీ జోరును ఎవ్వరూ ఆపలేరు.

**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తర్వాత..**

అసలు బీజేపీని తెలంగాణలో అధికారంలోకి తీసుకొచ్చే ఆలోచనేమైనా ఉందా? పార్టీ వ్యూహం ఏంటో అర్థం కావట్లే. ఎవరి గెలుపు కోసం పనిచేస్తున్నామో అస్సలు తెలియట్లే.

### ఇలాగైతే పార్టీ అధికారంలోకి వచ్చేనా?

**ప్రతి బీజేపీ కార్యకర్త మదిలో ఇదే ప్రశ్న.. అసలు లక్ష్యం ఏంటి? అని సందేహాలు**



(ఈవార్తలు పొలిటికల్ బ్యూరో)

దక్షిణాదిలో కర్ణాటక తర్వాత తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతోందని బీజేపీ కార్యకర్తలు కలలు కన్నారు. పలు ఉప ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికలు.. చూస్తే కమలం పార్టీ గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేస్తుందని కాలర్ ఎగరేశారు. కానీ, రెండేళ్లలో అంతా తలకిందులైంది. ఇప్పుడు సగటు బీజేపీ కార్యకర్త నిరాశలో కూరుకుపోయాడని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అసలు పార్టీ లక్ష్యం ఏంటి? పార్టీ ఉద్దేశం ఏంటి? ఏ పార్టీ కోసం పనిచేస్తున్నాం? ఎవరి గెలుపు కోసం పనిచేయాలి? ఇలాగైతే 2028లో తెలంగాణలో అధికారంలోకి వస్తామా? అన్న ప్రశ్నలు కమల సేనను వేధిస్తున్నాయని అంటున్నారు. దానికి.. జూబ్లీహిల్స్ తరువాయి 2 వ పేజీలో...



## రాజన్న ఆలయం మూసివేత

**ఇనుప రేకుతో ప్రధాన ద్వారం క్లోజ్.. ఎల్ఈడీ స్క్రీన్లకే మొక్కులు**

### కార్తీక మాసం కావడంతో భక్తుల ఆగ్రహం

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు నిరాశ ఎదురైంది. కార్తిక మాసం కావడంతో స్వామి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులకు అధికారులు షాక్ ఇచ్చారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున ప్రధాన ద్వారాన్ని ఇనుప రేకులతో పూర్తిగా మూసివేశారు.

వేములవాడ, నవంబర్ 12 (ఈవార్తలు): ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో గత నెల రోజులుగా గుడి పరిసరాల్లో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే దక్షిణ, ఉత్తర ప్రాకారాలు, నైవేద్య శాల, ఈవో కార్యాలయాన్ని తొలగించారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రధాన ద్వారాన్ని కూడా మూసివేశారు. ప్రస్తుతం -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,551 |
| వెండి (గ్రాము): | రూ.173 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,415 |

## ఉగ్ర ఘాతుకమే





### ఢిల్లీ పేలుడుపై కేంద్రం అధికారిక ప్రకటన

**ఘటనను ఖండించిన కేంద్ర కేబినెట్.. ఉక్కుపాదంతో ఉగ్రవాదాన్ని అణచివేస్తాం**

**భేటీలో ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటన.. సమావేశంలో పలు కీలక నిర్ణయాలు**

**మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్**

ఢిల్లీ కారు బాంబు పేలుడు ఘటన ఉగ్రవాదుల చర్యేనని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఢిల్లీ పేలుడు ఘటనను కేంద్ర కేబినెట్ ఖండించింది. రెండు నిమిషాలు మౌనం పాటించిన కేబినెట్.. మృతులకు సంతాపం తెలిపింది. ఉగ్రవాదంపై పోరు కొనసాగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఉగ్రవాదాన్నిపై జీరో టోలరెన్స్ విధానంతో అణిచివేస్తామని కేబినెట్ వెల్లడించింది. ఢిల్లీ పేలుడు నేపథ్యంలో కేబినెట్ సమావేశంతో పాటు కేంద్ర భద్రతా మండలి సమావేశమైంది.

న్యూఢిల్లీ: ఈ సమావేశంలో ఎర్రకోట పేలుళ్ల,ఉగ్రవాద నిర్మూలనపై ప్రత్యేక చర్చ జరిగింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కారు పేలుడు ఘటనలో తదుపరి కార్యాచరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా దౌత్యపరంగా తీసుకోవాల్సిన చర్యలు, అంతర్గత భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు, కేంద్ర మంత్రివర్గంలో చర్చి జరిగినట్లు తెలుస్తోంది. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని ప్రధాని తరువాయి 2 వ పేజీలో...




## జనవరి 26న పేలుళ్లకు స్కెచ్

**ఎర్రకోటలో ప్రధాని ప్రసంగమే టార్గెట్‌గా ఉగ్ర కుట్రలు**

**ఢిల్లీ పేలుడు కేసులో బయటపడుతున్న సంచలనాలు**

**ఉగ్రకుట్ర వెనుక ఐదుగురు విద్యావంతులైన డాక్టర్లు**

## విశ్వవాణి



సిడ్నీకి చెందిన లివర్‌పూల్ అనే హాస్పిటల్ సరికొత్త చికిత్సను ప్రారంభించింది. అత్యాధునిక ఎమ్మారై మెషీన్ సహాయంతో హానికారక కణితులను గడ్డ కట్టేలా చేసి, వాటిని నాశనం చేస్తోంది. తద్వారా శస్త్రచికిత్స అవసరం లేకుండా రోగులకు స్వాంతన చేకూరుతోంది.



## 10 కోట్ల మంది వచ్చినా..!

**ఇబ్బందులు లేకుండా మేడారం పునర్నిర్మాణం.. ఆదివాసీ పూజారుల ఆలోచనతోనే పనులు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి.. సురేఖ, సీతక్క, అడ్లూరితో కలిసి పర్యటన**


ములుగు, నవంబర్ 12 (ఈవార్తలు): పదికోట్ల మంది భక్తులు వచ్చినా దర్శనానికి ఇబ్బందులు లేకుండా మేడారం పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివాసీల మనోభావాలను గౌరవిస్తూ పనులు చేస్తున్నామని, ఆదివాసీ పూజారుల ఆలోచనతోనే పనులు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. బుధవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ మేడారం చేరుకుని, వనదేవతలను దర్శించుకొని, పునర్నిర్మాణ పనులను -2 వ పేజీలో...



## పెయ్యి పగులుతోంది!

**చలి పంజా.. మరో వారం రోజులు జాగ్రత్త**

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): రెండు తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరుగుతోంది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం అంతటా చలి తీవ్రత ఎక్కువ అవుతోంది. నవంబర్ మొదటి వారంలోనే శీతల గాలులు, పొగమంచు, తక్కువ ఉష్ణోగ్రతలు ప్రజలని వణికిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ ప్రకారం మరో వారం రోజుల పాటు ఇదే స్థాయి చలి కొనసాగనుంది. కొన్నిచోట్ల తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

13.11.2025

మేషం: మిత్రులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా పడతాయి. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తప్పవు. సంతానం ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

వృషభం: చేపట్టిన పనులు శ్రమతో గాని పూర్తి కావు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ప్రత్యర్థుల నుంచి ఊహించని సమస్యలు కలుగుతాయి. వ్యాపార ఉద్యోగాలు సాదాసీదాగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు.

మిధునం: వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. దూరప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. చేపట్టిన పనులు సజావుగా పూర్తి చేస్తారు.

కర్కాటకం: వ్యాపార, ఉద్యోగాల్లో ఊహించని మార్పులు ఉంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. రుణదాతల నుంచి ఒత్తిడి అధికమవుతుంది. బంధువులతో విభేదాలు మానసికంగా చికాకుగా వస్తాయి.

సింహం: చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారమవుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

కన్య: పనులు కొన్ని వాయిదా పడుతాయి. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు. స్థిరస్తి వివాదాలలో శిరో బాధలు తప్పవు.

తుల: వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. రాజకీయ సంబంధిత సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. మొండి బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికం: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. విలువైన వస్త్రా ఆభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని కష్టసుఖాలు విచారిస్తారు . ఉద్యోగాల్లో పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: సోదరులతో స్వల్ప వివాదాలు తప్పవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగులకు అదనపు పనిభారం ఉంటుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. కొన్ని వ్యవహారాలు శ్రమతో గాని పూర్తి కావు.

మకరం: ఉద్యోగులకు పనిఒత్తిడులు అధికమవుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం పనుల్లో ఆటంకాలు తప్పవు. భాగస్వామ్య వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

కుంభం: నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అందుతాయి. ముఖ్యమైన కార్యక్రమాల్లో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. అవసరానికి సన్నిహితుల సాయం పొందుతారు. జీవిత భాగస్వామితో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మీనం: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు అధికారులు అనుగ్రహం కలుగుతుంది. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. విందు వినోద కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. వ్యాపార విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి.

# జనవరి 26న పేలుళ్లకు స్కెచ్

## ఎర్రకోటలో ప్రధాని ప్రసంగమే టార్గెట్‌గా ఉగ్ర కుట్రలు.. ఢిల్లీ పేలుడు కేసులో బయటపడుతున్న సంచలనాలు

## ఉగ్రకుట్ర వెనుక ఐదుగురు విద్యావంతులైన డాక్టర్లు.. అరెస్టయిన డాక్టర్ ఫోన్ డేటాతో కుట్ర బట్టబయలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో దర్యాప్తు సంస్థలు విచారణను వేగవంతం చేయగా, దీని వెనుక భారీ ఉగ్ర కుట్ర వివరాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. గణతంత్ర దినోత్సవం రోజున ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని లక్ష్యంగా చేసుకుని పేలుళ్లకు పథకం రచించినట్లు అధికారులు గుర్తించారు. ఈ కుట్రకు ఐదుగురు ఉన్నత విద్యావంతులైన డాక్టర్లు సూత్రధారులుగా ఉండటం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. విచారణలో భాగంగా ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ముజమ్మిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పుల్వామాకు చెందిన ఇతడిని విచారించగా కీలక విషయాలు వెలుగుచూశాయి. అధికారులు అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని డేటాను విశ్లేషించగా, అతడు మహమ్మద్ ఉమర్‌తో కలిసి పలుమార్లు ఎర్రకోట వద్ద రెక్కీ నిర్వహించినట్లు తేలింది. జనవరి 26న ప్రధాని జాతిని ఉద్దేశించి ప్రసంగించే సమయంలో అక్కడ భారీ పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు దర్యాప్తు సంస్థలు



అనుమానిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌కు, ఢిల్లీ కారు పేలుడు ఘటనకు సంబంధం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. డాక్టర్ ముజమ్మిల్ ఫోన్ నుంచి లభించిన ఆధారాలతో ఈ కేసు దర్యాప్తును మరింత లోతుగా చేపట్టారు. ఈ కుట్రలో ఇంకా ఎవరెవరు ఉన్నారు? వారి ప్రణాళికలు ఏమిటి? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. చదువుకున్న వైద్యులే ఉగ్రవాదం వైపు మళ్లడంపై భద్రతా ఏజెన్సీలు దృష్టి సారించాయి.

# కమలంసేన...నిర్వేదం

మొదటి పేజీ తరువాయి

ఉప ఎన్నికలో ఆ పార్టీ వ్యూహమే కారణం అని చెప్తున్నారు. తెలంగాణలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నారు. ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. కానీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచేందుకు ఆ పార్టీ ఏం చేసింది? అంటే ఏమీ లేదంటున్నారు రాజకీయ పండితులు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగానే సాగిందని బీజేపీ కార్యకర్తలే చెప్తున్నారని అంటున్నారు. ఆ రెండు పార్టీలూ.. నువ్వా నేనా అని తాడోపేడో తేల్చుకుంటుంటే.. బీజేపీ మీనమేషాలు లెక్కించిందని, అభ్యర్థి ఎంపికలోనూ అలసత్వం ప్రదర్శించిందని చర్చించుకుంటున్నారు. ఆ పార్టీలో మునుపటి చురుకుదనం లోపించిందనే విశ్లేషణలు వస్తున్నాయి. జూబ్లీహిల్స్.. కిషన్ రెడ్డి నియోజకవర్గమైన సికింద్రాబాద్ పార్లమెంటరీ పరిధిలోనిది. తన పరిధిలో జరిగే ఎన్నికను గెలిపించుకోవాల్సిన భారం ఉండటంతో కిషన్ రెడ్డి ప్రచారంలో చురుగ్గా పాల్గొనాల్సింది. కానీ, పార్టీ పరిస్థితులు నెమ్మదిగానే సాగాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు బాధ్యతలు చేపట్టాక.. పార్టీ పరిస్థితి మరింత దారుణంగా తయారైందన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

### పోటీ ఇస్తుందనుకుంటే..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ తన బలం పెంచుకుని గట్టి పోటీ ఇస్తుందని ఆ పార్టీ నేతలు భావించారు. జాతీయ నాయకులను దించకుండా రాష్ట్ర నాయకుల ప్రచారంపైనే ఆధారపడ్డారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు అలా అలా ప్రచారం చేశారు. కిషన్‌రెడ్డి.. ప్రచార భారం మొత్తం తనపైనే వేసుకున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రచారం చివర్లో తన మార్కు ప్రచారం చేశారు. కానీ, అప్పటికే జూబ్లీహిల్స్ ఓటర్లు ఓ క్లారిటీకి వచ్చేశారన్న అభిప్రాయం ఏర్పడింది. దాంతో బండి ప్రచారం పెద్దగా ప్రభావం చూపలేదన్న అభిప్రాయాలు వచ్చాయి.

### డిపాజిట్ కూడా దక్కకుంటే..

ఈ నెల 14న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం వెలువడనుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉండనుంది. ఈ రిజల్ట్ బీజేపీకి ఏమాత్రం లాభం చేయదన్న అంచనాకు వచ్చాయి. నిజంగానే, డిపాజిట్ కూడా



దక్కకుంటే పరిస్థితి ఏంటి? అన్న ప్రశ్న కమలం సేనలో తలెత్తుతోంది. రోజురోజుకు బలం పెంచుకొని, అధికారం దిశగా అడుగులు వేయాల్సిన పార్టీ.. ఉనికి కోసమే పాకులాడటం ఏమిటి? అని కార్యకర్తలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మళ్లీ ప్రతిపక్షంలో ఉండాల్సిందేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ నుంచి సివిల్స్ ఇంటర్వ్యూకు 43 మంది

మొదటి పేజీ తరువాయి

సాయం పొందగా.. 20మంది మెయిన్స్‌లో క్వాలిఫై అయ్యారు. ఈ ఏడాది 202 మందికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించగా.. వారిలో 43 మంది ఇంటర్వ్యూ దశకు చేరుకున్నారు. ఈ 43 మంది అభ్యర్థులకు త్వరలోనే మరో రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందించనుంది.

# కేబినెట్ మళ్లీ వాయిదా

## జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత సమావేశం

## ఈ నెల 15వ తేదీకి మార్చుతూ నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మరోసారి వాయిదా పడింది. బుధవారం జరగాల్సి ఉన్న ఈ భేటీని ఈ నెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. వాస్తవానికి కేబినెట్ సమావేశం తొలుత నవంబర్ 7వ తేదీన జరగాల్సి ఉండగా, దానిని 12వ తేదీకి మార్చారు. ఇప్పుడు తాజాగా మరోసారి వాయిదా వేసి 15వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన మరుసటి రోజే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భేటీ తేదీని మార్చినట్లు సమాచారం. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయానికి రానుంది. ఈ సమావేశానికి మంత్రులతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరుకానున్నారు.

# 56వ సారి ఢిల్లీకి రేవంత్

మొదటి పేజీ తరువాయి

కూడా రేవంత్ రెడ్డి కలుసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర నిధుల మంజూరు, ప్రాజెక్టుల పురోగతి వంటి అంశాలపై ఈ సమావేశాలు జరగవచ్చని భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనంతరం రేవంత్ ఢిల్లీకి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక, గత 23 నెలల్లో సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లడం ఇది 56వసారి. అంటే.. సగటున 12 రోజులకు ఒకసారి ఆయన దేశ రాజధానికి వెళ్తుండటం గమనార్హం.

# 10 కోట్ల మంది వచ్చినా..!

మొదటి పేజీ తరువాయి

పరిశీలించారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పనులు జరుగుతున్నాయని.. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. గతంలో మేడారంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని.. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాక మేడారం అభివృద్ధి జరుగుతోందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని.. దీనిపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కలిసి ప్రధాన మంత్రిని నరేంద్ర మోడీని ఒప్పించాలని మంత్రి సీతక్క కోరారు. మేడారం మహాజాతర నాటికి పనులు పూర్తవుతాయని.. జాతర నాటికి పనులు పూర్తి చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మేడారం అంటే తమ బంధం, భక్తి, భావోద్వేగం, బాధ్యత అని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు. మేడారంలో పది తరాలకు సరిపడ అభివృద్ధి చేస్తామన్నారు. దీక్షతో, బాధ్యతతో జాతరనాటికి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవుడిపై రాజకీయాలు చేయొద్దని హితవుపలికారు. గతంలో వేసిన షెడ్లను తొలగించి పక్కకు పెట్టామన్నారు. మేడారంలో ఎలాంటి ప్రతిమలు లేకపోయినా కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారన్నారు. సమ్మక్క – సారలమ్మ ఆదివాసీల అస్థిత్వానికి సంకేతమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.



# రాజన్న ఆలయం మూసివేత

మొదటి పేజీ తరువాయి

కేవలం అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి స్వామివారికి చతుష్కాల పూజలు నిర్వహిస్తున్నారు. అయితే, కార్తీక మాసం వంటి పవిత్రమైన సమయంలో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆలయాన్ని మూసివేయడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలాదిగా తరలివచ్చిన వారు, స్వామివారిని దర్శించుకోలేక తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. చాలామంది భక్తులు ఆలయం ముందు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై కనిపిస్తున్న రాజన్నను చూసి, అక్కడి నుంచే మొక్కుకుని వెళ్లిపోతున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులు లేక వెలవెలబోతోంది. ప్రస్తుతం రాజన్న ఆలయానికి బదులుగా సమీపంలోని భీమేశ్వరాలయంలోనే దర్శన ఏర్పాట్లు చేశారు. కోడె మొక్కులు, ఇతర ఆర్జిత సేవలను కూడా అక్కడే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### భక్తులు అర్థం చేసుకోవాలి: విప్ ఆది శ్రీనివాస్

రాజన్న ఆలయ విస్తరణలో భాగంగా పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో భక్తులకు కలిగే అసౌకర్యాన్ని అర్థం చేసుకోగలమని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. భక్తులు అర్థం చేసుకొని ఆలయ విస్తరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎల్ఈడీ ద్వారా స్వామివారి దర్శనాన్ని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు దృష్ట్యా దర్శనాలు నిలిపివేసి, భీమేశ్వరాలయంలో దర్శనం కలిపిస్తున్నామని తెలిపారు.

# ఉగ్ర ఘాతుకమే

మొదటి పేజీ తరువాయి



మోదీ ఉద్ఘాటించినట్లు తెలిసింది. కేబినెట్ వివరాలను సమావేశానంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 'ఎగుమతుల ప్రమోషన్ మిషన్ బలోపేతానికి 25,060 కోట్ల రూపాయల కేటాయింపులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతులకు ఆర్థిక సాయాన్ని అందించనుంది. ఈ మిషన్ కింద రెండు పథకాలను కేంద్రం నిర్వహించనుంది. నిర్యాత్ ప్రోత్సాహన్, నిర్యాత్ దిశ కొత్త పథకాలను కేంద్రం అమలు చేయనుంది. ఎగుమతి దారులకు 100 శాతం క్రెడిట్ గ్యారెంటీ స్కీం అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 20,000 కోట్ల రూపాయల వరకు ఎలాంటి హామీ లేకుండా ఎగుమతి దారులకు ప్రభుత్వం.. క్రెడిట్ సపోర్ట్ ఇవ్వనుంది' అని వెల్లడించారు.

# పెయ్యి పగులుతోంది!

మొదటి పేజీ తరువాయి

మరింత చలి వుండవచ్చని తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, భద్రాచలం, ఖమ్మం ప్రాంతాల్లో రాత్రివేళల్లో చలితీవ్రత మరింత పెరగనుందని ఐఎండీ పేర్కొంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత భారీగా పెరిగింది. వరుసగా నాలుగు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మంగళవారం రాత్రి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు 10.2 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఉదయం సమయంలో పొగమంచు, చలిగాలులు వీస్తుండగా, రాత్రి సమయంలో చలి తీవ్రత క్రమక్రమంగా పెరుగుతోంది. నవంబర్ నెలలో సగటున 13 నుంచి 17 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని.. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రానున్న 3 రోజులుల పాటు ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



# చలి పులి.. జాగ్రత్త!

## ప్రజలకు వైద్యారోగ్యశాఖ అడ్వైజరీ

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో సీజనల్ ఫ్లూ, శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్లు వ్యాపించే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ హెచ్చరిస్తూ ఓ అడ్వైజరీ విడుదల చేసింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం రానున్న వారం రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ కంటే 2-3 డిగ్రీల మేర తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శరీర నొప్పులు, అలసట వంటి లక్షణాలు కనబడితే జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ సూచించింది. సీజనల్ ఫ్లూ సాధారణంగా వారం రోజుల్లో తగ్గిపోతుందన్నా... గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలు, 65 ఏళ్లు పైబడినవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వైద్యుడిని వెంటనే సంప్రదించాలంటూ సూచించింది.

ఈ లక్షణాలతో జాగ్రత్త

అధిక జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చర్మం లేదా పెదవులు నీలి రంగులోకి మారడం, రక్తం కలిసిన కఫం రావడం, ప్రవర్తనలో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వెంటనే చికిత్స పొందాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా. బి. రవీందర్ నాయక్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. దగ్గు, తుమ్ము సమయంలో రుమాలు లేదా టిష్యూపేపర్‌తో నోరు, ముక్కు మూసుకోవాలి. తరచుగా చేతులు సబ్బుతో కడుక్కోవాలి. జ్వరం, దగ్గు, తుమ్ము ఉన్నవారు ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాలి. ఎక్కువగా నీరు తాగి, పోషకాహారం తీసుకోవాలి. గదుల్లో తగినంత గాలి ప్రసరణ ఉండేలా చూడాలి. పబ్లిక్ ప్రదేశాల్లో ఉమ్మి వేయరాదు. డాక్టర్ సలహా లేకుండా మందులు తీసుకోకూడదని... ప్రజారోగ్య శాఖ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక పడకలు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచిందని డా. రవీందర్ నాయక్ తెలిపారు.

# కోమటిరెడ్డి జాగృతితో పెట్టుకోకు

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నల్లగొండ, నవంబర్ 12 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి సంస్థతో పెట్టుకున్నవారు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వంతో పరిష్కారం చేయించడమే తెలంగాణ జాగృతి లక్ష్యమని అన్నారు. ఆసుపత్రుల్లో సిబ్బంది సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడం బాధాకరమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. జిల్లాలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాంటి పెద్ద నాయకులు ఉన్నప్పటికీ, జిల్లా అభివృద్ధిలో వెనుకంజలో ఉందని విమర్శించారు. జిల్లా కేంద్రంలో ఉన్న తన ఫ్లెక్సీని చించివేయడం సరికాదని ఆమె అన్నారు. జిల్లాలో ప్రతిపక్షం లేకపోవడంతో అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీ నాయకులు జాగృతిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆమె అన్నారు. “నాకు, మంత్రి కోమటిరెడ్డికి ఎలాంటి పంచాయతీ లేదు. అయినా నా ఫ్లెక్సీలు ఎందుకు తొలగించారు?” అని ఆమె మండిపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి అరెస్ట్ చేసిన జాగృతి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాను ప్రజా సమస్యలపై పోరాడేందుకే నల్లగొండకు వచ్చానని, రాజకీయాలు చేసేటప్పుడు బలమైన అభ్యర్థులనే బరిలో దింపుతామని అన్నారు. “జాగృతి నాయకులతో పెట్టుకున్న వాళ్లు ఎవరూ బాగుపడలేదు” అని కవిత వ్యాఖ్యానించారు.

# మత్స్యకారుల సంక్షేమానికి కృషి: జూపల్లి



కొల్లాపూర్, నవంబర్ 12 (ఈవార్తలు): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని సోమశిల వద్ద శ్రీశైలం బ్యాక్ వాటర్ కృష్ణానదిలో లక్ష చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని వంద శాతం సబ్సిడీతో అమలు చేస్తోందని వెల్లడించారు. మత్స్యకారులకు అనేక పథకాలు ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరచడం, ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా చేప పిల్లల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 2.50 కోట్ల చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు చేశామని అన్నారు. మత్స్యకారులు అలవి వలలను ఉపయోగించరాదని మంత్రి హెచ్చరించారు. నాణ్యమైన చేప పిల్లలనే మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. అటు.. శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సోమశిల గ్రామంలో పర్యటించిన మంత్రి సోమశిల-శ్రీశైలం క్రూయిజ్ లాంచీని సందర్శించారు. శ్రీశైలం వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని, రెగ్యులర్‌గా శ్రీశైలంకు లాంచి నడిపేలా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూలు జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహకు ఆదేశించారు.

# ఆవిష్కరణలకు దారిదీపం తెలంగాణ: దుద్దిళ్ల




హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): ఆవిష్కరణలలో తెలంగాణ రాష్ట్రం భారతదేశానికి దారిదీపంలా నిలిచిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ తెలుగు ఐటీ మహాసభలు-2025 కౌంట్‌డౌన్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన తెలుగు టెక్నాలజీ నిపుణులు ప్రపంచవ్యాప్తంగా ఆధునిక మార్పులకు దారితీస్తున్నారని చెప్పారు. డబ్ల్యూటీఐటీసీ 2025 దుబాయ్ కాన్ఫరెన్స్ మన గ్లోబల్ ప్రతిభ, ఇన్నోవేషన్, కలబోరేషన్‌కు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు ఐటీ మిషన్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు. డిసెంబర్ 12 నుంచి యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో జరగనున్న ఈ అంతర్జాతీయ ఐటీ మహాసభలలో 100 కంటే ఎక్కువ దేశాల తెలుగు సాంకేతిక నిపుణులు, వ్యాపారవేత్తలు, ఇన్నోవేటర్లు పాల్గొననున్నారని తెలిపారు. డబ్ల్యూటీఐటీసీ చైర్మన్ సందీప్ కుమార్ మక్తాలా మాట్లాడుతూ టీ హబ్‌లో ఈ కౌంట్‌డౌన్ ప్రారంభంతో చారిత్రాత్మక గ్లోబల్ ఈవెంట్ కోసం తమ పనులు తుది దశకు చేరాయన్నారు. డబ్ల్యూటీఐటీసీ 2025లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు టెక్నాలజీ నిపుణులు, ఇన్నోవేటర్లు, ఇన్వెస్టర్లు ఒక్క జెండా కింద ఏకం అవుతారని.. ఇది గ్లోబల్ టెక్ కథనాన్ని కొత్త దిశలో మలుస్తుందని అన్నారు. దుబాయ్ ఎడిషన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బ్లాక్‌చెయిన్, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ వంటి కీలక అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే డబ్ల్యూటీఐటీసీ గ్లోబల్ ఇన్వెస్టర్ పిచ్, స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ ఎక్స్‌పో, విమెన్ ఇన్ టెక్ సమ్మిట్, అలాగే 2026%-%28 గ్లోబల్ లీడర్షిప్ టీమ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ టెక్నాలజీ, స్టార్టప్, ఇన్నోవేషన్ ప్రాధాన్య కార్యక్రమాలను సంయుక్తంగా ప్రదర్శించనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఐఎల్ డైరెక్టర్ సుధారెడ్డి, డబ్ల్యూటీఐటీసీ సభ్యులు యామిని, మానస, అక్షిత సింగారం, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

# 42 టేబుల్స్, 10 రౌండ్లు

## జూబ్లీహిల్స్ కౌంటింగ్‌కు ఏర్పాట్లు

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్‌కు ఈసీ ఏర్పాట్లు చేపడుతోంది. మంగళవారం పోలింగ్ పూర్తయిన తరువాత భారీ భద్రత నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఈ నెల 14న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటల వరకు ముగిసే అవకాశం ఉంది. నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్ స్టేషన్లు ఉండగా మొత్తం 42 టేబుల్స్ ఏర్పాటు చేశారు. మొత్తం 10 రౌండ్లలో పూర్తి స్థాయి ఫలితాలు తేలనున్నాయి. ఒక్కో టేబుల్ వద్ద ముగ్గురు అధికారులు కౌంటింగ్‌లో పాల్గొననున్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను తీసుకొచ్చి కౌంటింగ్ ప్రక్రియను స్టార్ట్ చేయనున్నారు. ఈ ఎన్నికల్లో బుధవారం సాయంత్రం వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఒక్కటి కూడా రాలేదు. హెూం ఓటింగ్ ఓట్లు లెక్కించనున్నారు. మొత్తం హెూం ఓటింగ్ కోసం 103 మంది నుంచి అప్లికేషన్లు రాగా ఇందులో 101 మంది ఓటు వేయగా ఇద్దరు మరణించారు. ఆ తరువాత ఈవీఎంలో ముందుగా షేక్‌పేట్ డివిజన్ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఎర్రగడ్డ డివిజన్ ఓట్ల కౌంటింగ్ జరగనుంది. కౌంటింగ్ సెంటర్ వద్ద ఎలాం అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో రౌండ్ పూర్తయిన వెంటనే ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఫలితాన్ని అప్‌లోడ్ చేయనున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్లు 4,01,365 ఉండగా.. అందులో పురుషులు 2,08,561, మహిళలు 1,92,779, ఇతరులు 25 మంది ఉన్నారు. మొత్తం 1,94,631 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 99,771 మంది పురుషులు కాగా, 94,855 మహిళలు, ఇతరులు ఐదుగురు ఉన్నారు. నియోజవర్గంలో మొత్తం 48.49 శాతం పోలింగ్ నమోదైనట్లుగా ఎన్నికల అధికారులు తెలిపారు.



## ఒంటరి తల్లిగా జీవించడం కష్టం: సానియా మీర్జా

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో విడాకుల తర్వాత తొలిసారి తన వ్యక్తిగత జీవితంలోని కష్టాల గురించి బహిరంగంగా మాట్లాడింది. ఒంటరి తల్లిగా తన కుమారుడిని పెంచడం ‘చాలా చాలా కష్టం’ అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తన ఆప్తమిత్రురాలు, బాలీవుడ్ దర్శకురాలు ఫరా ఖాన్‌తో కలిసి నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ఆమె ఈ విషయాలను పంచుకుంది. ఫరా ఖాన్ హెూస్ట్ చేసిన ‘సర్వింగ్ ఇట్ అప్ విత్ సానియా’ అనే పాడ్‌కాస్ట్‌లో వీరిద్దరూ స్నేహం, మాతృత్వం, ఒంటరిగా పిల్లల్ని పెంచడంలో ఎదురయ్యే సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఫరా ఖాన్, సానియాను ప్రశంసిస్తూ, “ఒంటరి తల్లిగా ఉండటం కంటే కష్టమైనది ఏమీ లేదు. నువ్వు నీ కెరీర్‌లో ఉన్నత శిఖరాలను, వ్యక్తిగతంగా అట్టడుగు స్థితిని చూశావు. రెండింటినీ సమానంగా ఎదుర్కొన్నావు” అని అన్నారు. దీనికి సానియా స్పందిస్తూ, “ఇది చాలా చాలా కష్టం. మనందరికీ మన ప్రయాణం ఉంటుంది, సరైనది ఎంచుకోవాలి” అని తన కష్టాన్ని అంగీకరించింది. ఈ సందర్భంగా తన జీవితంలో ఎదుర్కొన్న తీవ్రమైన ఒత్తిడి గురించి సానియా గుర్తుచేసుకుంది. ఒకసారి తనకు పానిక్ అటాక్ వచ్చినప్పుడు, ఫరా ఖాన్ సెట్‌కు వచ్చి అండగా నిలిచారని తెలిపింది. “ఆ రోజు మీరు రాకపోతే నేను ఆ లైవ్ షో చేసేదాన్ని కాదు. నేను వణికిపోతున్నాను” అని సానియా చెప్పగా, “నువ్వు పానిక్ అటాక్‌తో ఉండటం చూసి నేను భయపడ్డాను. షూటింగ్ ఉన్నా పైజమాలోనే పరిగెత్తుకుంటూ వచ్చేశాను” అని ఫరా ఆ సంఘటనను గుర్తు చేసుకున్నారు. సమాజంలో కష్టాల పట్ల దృక్పథం, విడాకుల సాధారణీకరణ వంటి అంశాలపైనా వీరిద్దరూ చర్చించుకున్నారు. గతంలో తల్లిదండ్రులు విడిపోవడం పెద్ద విషయంగా చూసేవారని, ఇప్పుడు అది సాధారణమైపోయిందని ఫరా పేర్కొన్నారు. అయితే, ఇది ఎంత సాధారణమైనా పిల్లలపై దాని ప్రభావం కచ్చితంగా ఉంటుందని సానియా అభిప్రాయపడింది. సానియా మీర్జా 2010లో షోయబ్ మాలిక్‌ను వివాహం చేసుకుంది. వీరికి 2018లో కుమారుడు ఇజాన్ మీర్జా మాలిక్ జన్మించాడు. గతేడాది (2024) ఆరంభంలో వీరిద్దరూ విడాకులు తీసుకున్నారు.

## ఎల్ఎల్ఎం స్పాట్ అడ్మిషన్లకు గైడ్‌లైన్స్ రిలీజ్

ఓయూ/హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): ఎల్ఎల్ఎం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు అధికారులు గైడ్‌లైన్స్ విడుదల చేశారు. కన్వీనర్ కోటాలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోని వారు సైతం స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లు పూర్తిగా మెరిట్ ఆధారంగానే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేస్తామన్నారు. కాలేజ్ లింక్ ద్వారా స్పాట్ రిజిస్ట్రేషన్లను 17వ తేదీ వరకు చేసుకోవాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల కేటాయింపును 18న విడుదల చేస్తామని, 19వ తేదీ మధ్యాహ్నం పన్నెండుగంటల్లోపు సంబంధిత కళాశాలల్లో సీట్లు పొందిన అభ్యర్థులు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.




## ప్రియాంక చోప్రా.. మందాకిని

సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న ‘గ్లోబ్ ట్రాటర్’ సినిమా నుంచి ఓ అదిరిపోయే అప్డేట్ వచ్చింది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. ఈ చిత్రంలో ‘మందాకిని’ అనే పాత్రలో ప్రియాంక కనిపించనున్నారు. ‘ఆమె వస్తోంది... ఆమే మందాకిని’ అనే క్యాప్షన్‌తో దర్శకుడు రాజమౌళి తన సోషల్ మీడియా ఖాతాలో ఈ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ లుక్‌లో ప్రియాంక చోప్రా చీరకట్టులో, హీల్స్ ధరించి, చేతిలో పిస్టల్ తో ఎంతో డైనమిక్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశారు. ఈ పోస్టర్ విడుదలైన క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై అంతర్జాతీయ స్థాయిలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో సాగే గ్లోబల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. మహేశ్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, పాన్-వరల్డ్ స్థాయిలో ఈ సినిమాను శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ‘కుంభ’ అనే క్రూరమైన విలన్ పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ప్రియాంక చోప్రా ‘మందాకిని’గా పరిచయం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై హైప్ పెరిగింది.

## బాంబు పేలుళ్లకు, బీజేపీకేం సంబంధం?

### తప్పుడు ప్రచారంపై రఘునందన్ రావు ఫైర్

హైదరాబాద్, నవంబర్ 12 (ఈవార్తలు): ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనను బీజేపీకి ఆపాదిస్తూ కొందరు సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం దేశద్రోహం కిందికే వస్తుందని ఆయన హెచ్చరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలో నిర్వహించిన ‘సర్దార్-ఏక్తా పాదయాత్ర’లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. “చేతిలో ఫోన్ ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే పేలుళ్లు జరుగుతాయని, దీని వెనుక బీజేపీ ఉందని నీచంగా మాట్లాడుతున్నారు. అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?” అని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్న వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, ప్రజలు ఎవరూ ఇలాంటి వారిని సమర్థించవద్దని ఆయన కోరారు. ఢిల్లీలో బాంబులు పేల్చాలని ఒక వర్గం వారు కుట్ర పన్నారని, ఇప్పుడు ఆ నెపాన్ని బీజేపీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని రఘునందన్ రావు ఆరోపించారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. ఉగ్రవాద చర్యలను ఖండించాల్సింది పోయి, ఒక రాజకీయ పార్టీపై బురద చల్లడం దారుణమని ఆయన అసహనం వ్యక్తం చేశారు.

## సోషల్ వాణి




జూబ్లీహిల్స్ ఎన్నికలో శాంతి భద్రతలు, ఎలక్షన్ కమిషన్ పనితీరు, బహిరంగ బెదిరింపులు, దాడులు, దొంగ ఓట్లు, ప్రజాస్వామ్యం.. వీటిపై సోకాల్డ్ పౌర సమాజపు సుద్దపూస సొన్నారులు ఒక్కడన్న మాట్లాడిండా? ఎటు పాయె జనాల్ని ఎడ్డిగొర్రెల్లెక్క వంచించే సోకాల్డ్ ప్రజాస్వామిక పరిరక్షణ పరికి కంపలు? గతంలో ఊ అంటే ముడ్డిలో పల్లేరుకాయ పలకరించినట్టు ఊకుకెనే ఎగుర్దురు కదా! ఏమైందిప్పుడు ? ఏమడ్డం పడుతున్నది?

**- పాశం రఘునందన్ రెడ్డి**



# చెప్పకుండానే దర్శనాలు ఆపడమేంటి?

రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ,నవంబర్ 12 (ఈవార్తలు): ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా వేములవాడ రాజన్న ఆలయ దర్శనాలు నిలిపివేయడం ఏంటని రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మండిపడ్డారు. ఆలయ అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదని, ఆలయాన్ని మూసేస్తే అనేక కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. ముందుగా ఆలయంలోని దర్గాను తొలగించిన తర్వాతే దేవత మూర్తుల విగ్రహాలను ముట్టుకోవాలన్నారు. దర్శనాల నేపథ్యంలో భక్తులకు ప్రజలకు స్పష్టమైన ప్రకటన ఇవ్వాల్సిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్,రేగుల రాజకుమార్, మెరుగు లక్ష్మణ్, అన్నం నరసయ్య, పిన్నింటి హనుమాన్లు, నామాల శేఖర్, కొన్నాళ రఘుపతి, నేరెళ్ల సాయి, గుడిసె మనోజ్, లాల శేఖర్, సగ్గు రాహుల్, గుంటి కనకయ్య, జవాజీ శేఖర్, డాక్టర్ వెంకన్న, నేరెళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొడిమ్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు రాగానే త్వరగా కొనుగోలు చేయాలని అన్నారు. బుధవారం కొడిమ్యాల మండలంలోని పూడూరు, నాచుపల్లి, డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, రైతులకు 48 గంటలలోగా చెల్లింపులు జరిగేలా నిర్వాహకులకు తెలిపారు. టార్పాలిన్, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు అవసరమైన మేరకు అందుబాటులో ఉండాలని సూచించారు.

## 100 కే మెడికల్ కాలేజీల భూముల అమ్మకం

### చంద్రబాబుపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపణలు

### పుంగనూరులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

పుంగనూరు, నవంబర్ 12 (ఈవార్తలు): ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని, లక్షల కోట్ల రూపాయల విలువైన భూములను కేవలం వంద రూపాయలకే కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "50 ఎకరాల మెడికల్ కాలేజీ భూముల ద్వారా రాష్ట్రానికి లక్షల కోట్ల ఆదాయం వస్తుంది. పేద విద్యార్థులు డాక్టర్లు అయ్యేందుకు అవకాశం లభిస్తుంది. కానీ, కాలేజీలను ప్రైవేటుపరం చేయడం వల్ల రాష్ట్రం సుమారు 2150 మెడికల్ సీట్లను కోల్పోతుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందులలో 50 సీట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయినా, చంద్రబాబు అడ్డుపడి నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాశారని పెద్దిరెడ్డి మండిపడ్డారు. గతంలో వైఎస్ జగన్ 'నాడు-నేడు' కింద ఆసుపత్రులు, పాఠశాలల అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తే, ఇప్పుడు అవన్నీ మూలన పడ్డాయని అన్నారు. "రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటైతే ఏటా 4500 సీట్లు అదనంగా వస్తాయి. ఐదేళ్లలో 30 నుంచి 40 వేల మంది వైద్య విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. ఇంతటి ప్రయోజనాన్ని దెబ్బతీస్తూ, కేవలం డబ్బు ఆశతోనే చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులు, మంత్రులు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారు" అని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు.

## కర్నూలు బస్సు ప్రమాదంలో షాకింగ్ వీడియో

కర్నూలు, నవంబర్ 12 (ఈవార్తలు): కర్నూలు జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపిన వేమూరి కావేరి బస్సు ప్రమాదానికి సంబంధించి మరో కొత్త వీడియో వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు జరిగిన పరిణామాలను ఈ వీడియో కళ్లకు కట్టినట్టు చూపిస్తోంది. మానవత్వం మంటగలిసిపోతోందా అని ప్రశ్నించేలా ఉన్న ఈ దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రధాన బస్సు ప్రమాదం జరగడానికి ముందు, అదే మార్గంలో శివ అనే యువకుడు ప్రయాణిస్తున్న బైక్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, ఆ తర్వాత జరిగిన పరిణామాలను అదే దారిలో వెళుతున్న మరో బస్సులోని కెమెరా రికార్డ్ చేసింది. ఈ వీడియో ప్రకారం, ప్రమాదం జరిగిన తర్వాత శివ స్నేహితుడు ఎర్రిస్వామి, అతని మృతదేహాన్ని రోడ్డు పక్కకు లాగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు శివ మృతదేహం, మరోవైపు రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్ ఉన్నాయి. ఎర్రిస్వామి ఏం చేయాలో తెలియక నిస్సహాయంగా మృతదేహం పక్కనే నిల్చున్నాడు. అత్యంత విస్మయానికి గురిచేసే విషయం ఏమిటంటే, ఆ మార్గంలో అనేక వాహనాలు వెళ్లాయి. రోడ్డుపై బైక్, పక్కనే ఒక మృతదేహం ఉన్నప్పటికీ ఏ ఒక్క వాహనదారుడు కూడా ఆగి సహాయం చేసే ప్రయత్నం చేయలేదు. కనీసం ఏం జరిగిందని కూడా అడగలేదు. తమకేమీ పట్టనట్టుగా చూసీ చూడనట్టుగా వాహనదారులు తమ వాహనాల్లో దూసుకుపోయారు. ఈ దృశ్యాలు ప్రమాదం తీవ్రత కంటే ఎక్కువగా ప్రజల నిర్లక్ష్యాన్ని, మానవత్వ రాహిత్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఈ కొత్త వీడియో.. బస్సు ప్రమాదంపై జరుగుతున్న విచారణలో కీలక ఆధారంగా మారే అవకాశం ఉంది.

# బాలుడికి అడ్లూరి అండ!

**విద్యార్థి చికిత్సకు మంత్రి మానవతా సాయం.. ఎస్సీ సంక్షేమ శాఖ నుంచి 18 లక్షల వైద్య ఖర్చులు**

### ఇప్పటికే బాధితుడికి 5 సార్లు పరామర్శ

జగిత్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): రాజకీయ నాయకులు అంటేనే మమ అనిపించి చేతులు దులుపుకుంటారన్న అపవాదు ఉంది. కానీ, ఓ బాలుడిని కాపాడేందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా, ఓ విద్యార్థి చికిత్స కోసం తాను చేయాల్సిందంతా చేశారు. అసలేం జరిగిందంటే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు ఎస్సీ బాలుర వసతిగృహంపై గత నెల పిడుగు పడటంతో 8వ తరగతి విద్యార్థి బొల్లె హిమశ్ చంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. టెర్రస్‌పై ఆరేసిన దుస్తులు తీసుకురావడానికి వెళ్లిన హిమేశ్‌పై పిడుగు పడింది. క్షణాల్లోనే మంటలు వ్యాపించి, అతని చేతులు, వెన్ను తీవ్రంగా కాలిపోయాయి. వసతిగృహ సిబ్బంది వెంటనే బాలుణ్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి, ఆపై పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు.విద్యార్థి పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థికి మెరుగైన వైద్య సేవలు అందించాలని యశోద వైద్యులకు సూచించారు. మంత్రి పలుమార్లు ఆసుపత్రిని సందర్శించి




విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులు నెలరోజుల పాటు చికిత్స అందించి, ప్లాస్టిక్ సర్జరీ చేశారు. చికిత్సకు దాదాపు రూ.18 లక్షలు ఖర్చు అయినా మంత్రి అడ్లూరి మానవతా దృక్పథంతో అండగా నిలబడ్డారు. మొత్తం వైద్య ఖర్చులను ఎస్సీ సంక్షేమ శాఖ నిధుల నుండి చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. హిమశ్ చంద్ర స్వగ్రామం మల్యాల మండలంలోని మద్దుట్ల గ్రామం కాగా... బాలుని తండ్రి బొల్లె శ్రీనివాస్ గల్ఫ్ లో కూలీగా పనిచేస్తున్నారు. మంత్రి చొరవతోనే తన కుమారునికి సరైన చికిత్స అంది కోలుకున్నాడంటూ శ్రీనివాస్ మంత్రి లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### బాధితుడికి 5 సార్లు పరామర్శ

బాధితులను రాజకీయ నేతలు ఒకసారి పరామర్శించడమే గొప్ప. అలాంటిది.. హిమేశ్‌ను మంత్రి అడ్లూరి ఏకంగా ఐదుసార్లు పరామర్శించారు. తన సిబ్బందిని వెంటబెట్టుకొని ఆస్పత్రి చుట్టూ తిరిగారు. ఎప్పటికప్పుడు విద్యార్థి బాగోగులు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు తీవ్రంగా కృషి చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫోన్ చేసి"విద్యార్థికి అత్యుత్తమ వైద్యం అందించండి. ఎంత ఖర్చైనా సరే, పిల్లవాడి ప్రాణం ముఖ్యం" అని ఆదేశించారు. యశోద ఆసుపత్రిలో వైద్యులు నెలరోజులపాటు చికిత్స అందించి, ప్లాస్టిక్ సర్జరీ చేశారు. చికిత్స ఖర్చు దాదాపు రూ.18 లక్షలు కావడంతో, సాధారణ కుటుంబం భరించలేని స్థితి ఏర్పడింది. విషయం తెలిసిన మంత్రి అడ్లూరి..మొత్తం వైద్య ఖర్చును సంక్షేమ శాఖ నిధుల నుంచి చెల్లించాలంటూ ఆదేశించారు. దాంతో ఎస్సీడీడీ కమిషనర్ క్షితిజ యశోద ఆసుపత్రికి చెల్లించాల్సిన బిల్లును చెక్కు రూపంలో అందజేశారు.


# నిఘా దళాలే నిజమైన దేశభక్తులు

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. విజయనగరంలో ఐసిస్ ఉగ్రకుట్ర భగ్నంపై స్పందన**

అమరావతి, నవంబర్ 12 (ఈవార్తలు): దేశ భద్రత కేవలం కేంద్ర ప్రభుత్వానికో, ఢిల్లీలోని కొందరికో పరిమితమైన అంశం కాదని, గ్రామ పంచాయతీ నుంచి రాజధాని వరకు ప్రతి ఒక్కరి సమష్టి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఎలాంటి గుర్తింపు ఆశించకుండా దేశాన్ని రక్షించే నిఘా, భద్రతా దళాలే నిజమైన హీరోలని ఆయన కొనియాడారు. ఢిల్లీ పేలుడు ఘటన, ఫరీదాబాద్ లో పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాల స్వాధీనం నేపథ్యంలో... దేశ భద్రత, అంతర్గత ముప్పులపై ఆయన తన సోషల్ మీడియా పోస్టులో కీలకమైన వ్యాఖ్యలు చేశారు. "ముందుగా మన దేశ భద్రతా, గూఢచార సంస్థలలో పనిచేస్తున్న వారికి నా హృదయపూర్వక వందనాలు. వారే మన నిజమైన హీరోలు, మనకు తెలియని తెర వెనుక యోధులు. ఈ దేశభక్తులు ఎలాంటి గుర్తింపునూ ఆశించకుండా, రేయింబవళ్లు నిశ్శబ్దంగా దేశానికి సేవ చేస్తున్నారు. వారి మౌన కృషే ఊహకందని పెను ప్రమాదాలను నివారిస్తూ, మన దేశ భద్రతను, శాంతిని కాపాడుతోంది. సామాన్య పౌరులుగా మనం ఊహించడానికి కూడా భయపడే ఎన్నో విపత్తులను వారు మొగ్గలోనే తుంచేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఎంత పెద్ద ప్రమాదం తప్పిందో ఒక్కసారి ఆలోచించండి. 2,900 కిలోల ఐఈడీల తయారీ ముడిసరుకు, దాచిపెట్టిన అసాల్ట్ రైఫిళ్లు, రైసిన్ అనే భయంకరమైన విష ప్రయోగం చేయాలన్న కుట్రలను మన ఏజెన్సీలు భగ్నం చేయకపోయి ఉంటే ఏం జరిగి ఉండేది? మన వీధుల్లోకి రాకముందే వారు నాశనం చేస్తున్న ఆ విలయానికి మనం వారికి సర్వదా రుణపడి ఉంటాం. ఉగ్రవాద మూలాలు దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్నాయి. అవి మన సమాజం నడిబొడ్డుకు చేరుకుంటున్నాయి. ఇది ఎక్కడో దూరంగా ఉన్న సమస్య కాదు. ఇటీవలే, విజయనగరంలో అరెస్టులతో మొదలైన ఐసిస్ భావజాలంతో ముడిపడిన ఒక భయంకరమైన ఉగ్రకుట్రను ఎన్ఐఏ, ఇతర ఏజెన్సీలు విజయవంతంగా ఛేదించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుని ఐఈడీ దాడులు చేయాలన్న వారి పన్నాగాన్ని అడ్డుకున్నారు. నేటి కఠోర వాస్తవం ఏమిటంటే, ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే చిన్న పట్టణాలు, నిశ్శబ్ద పల్లెల నుంచే ఇప్పుడు భద్రతా ముప్పులు, ఉగ్రదాడులు పుట్టుకొస్తున్నాయి. జాతీయ భద్రత



అనేది కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే సంబంధించిన పని కాదు, అది ఢిల్లీలోని కార్యాలయాలకే పరిమితమైన అంశం అంతకన్నా కాదు. ఈ బాధ్యత ప్రతి రాష్ట్ర ప్రభుత్వానిది, ప్రతి ప్రభుత్వ శాఖది, గ్రామ పంచాయతీ నుంచి రాజధాని వరకు ప్రతి స్థానిక సంస్థది. ప్రతి ఒక్కరికీ ఇందులో తిరుగులేని, ఉమ్మడి బాధ్యత ఉంది. ప్రాంతీయ రాజకీయ పార్టీలు జాతీయ భద్రతను కేవలం జాతీయ పార్టీల అంశంగా భావించి పక్కన పెట్టడానికి వీల్లేదు. అది ప్రాంతంతో సంబంధం లేకుండా, భారతదేశంలోని ప్రతి రాజకీయ పార్టీ అజెండాలో అత్యంత ప్రాధాన్య అంశం కావాలి. దేశ భద్రతకు మించి ఏ రాజకీయమూ ఉండకూడదు. మన వీధుల్లో, మన పరిసరాల్లో రాడికలైజేషన్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. కానీ, మనం చూసీచూడనట్లుగా కళ్లు మూసుకుంటున్నాం. ఈ పెను ముప్పును ఎదుర్కోవాలంటే ప్రతి సంస్థ ఒక



రక్షణ దుర్గంలా మారాలి. ప్రతి కాలనీ, ప్రతి పాఠశాల, ప్రతి కళాశాల, ప్రతి విశ్వవిద్యాలయం, ప్రతి కార్యాలయం, ప్రతి వృత్తిపరమైన సంస్థ, ప్రతి మతపరమైన సంస్థ, దేశంలోని ప్రతి పోలీస్ స్టేషన్ అప్రమత్తంగా ఉండాలి. నిరంతర నిఘా అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు, అది ప్రతి భారత పౌరుడి ప్రాథమిక, ప్రథమ కర్తవ్యం. మనం ఏమరపాటుగా ఉంటే, చెల్లించాల్సిన మూల్యం చాలా ఎక్కువగా ఉంటుంది. భారతదేశం కేవలం అత్యధిక జనాభా ఉన్న దేశం మాత్రమే కాదు, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ఈ రోజు మనం ఒక కీలకమైన దశలో ఉన్నాం. బయటి శత్రువులతో మన వీర సైనికులు పోరాడగలరు, సరిహద్దులను కాపాడగలరు. కానీ, దేశాన్ని అంతర్గతంగా విచ్ఛిన్నం చేయడానికి నిరంతరం పనిచేస్తున్న శక్తుల నుంచి మనల్ని ఎవరు కాపాడాలి? బూటకపు లౌకికవాదం, బుజ్జగింపు రాజకీయాలు, జాతీయ సార్వభౌమత్వం కంటే భాషా, ప్రాంతీయ అహంకారాలను రెచ్చగొట్టడం వంటివి కేవలం రాజకీయ ఎత్తుగడలు కావు. అవి మన ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరిచేందుకు పన్నిన లోతైన కుట్రలు. పౌరులు, ముఖ్యంగా యువత, కేవలం ప్రేక్షకులుగా మిగిలిపోవద్దు. మన శక్తులను, సమయాన్ని చిల్లర సమస్యలు, కృత్రిమంగా సృష్టించే ఆవేశాలతో వృథా చేసుకోవద్దు. మనం మతం, కులం, భాష, ప్రాంతీయ రాజకీయాల చుట్టూ కొట్టుకుంటుంటే, బయటి శక్తులు మన భారతీయ నాగరికతను, మన ఆత్మను నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ గందరగోళాన్ని దాటి చూడండి, బాధ్యతగా మెలగండి.

## భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు

జగిత్యాల టౌన్, నవంబర్ 12 (ఈవార్తలు): భవన నిర్మాణ కార్మికులు మీసేవ ద్వారా రూ.110 చెల్లించి 5 ఏళ్ల కాలపరిమితితో లేబర్ కార్డును పొందాలని జిల్లా సహాయ కార్మిక కమిషన్ సూచించారు. జగిత్యాల, మెట్‌పల్లి కార్యాలయాల్లో దరఖాస్తును సమర్పించాలని తెలిపారు. ఈ విషయంలో మధ్యవర్తులను, దళారులను సంప్రదించవద్దని చెప్పారు. మీసేవ సెంటర్లలో అధిక ఫీజులు వసూలు చేస్తే, జిల్లా సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయము, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. 9492555250 నంబర్ ద్వారా కంప్లెయింట్ చేయొచ్చని పేర్కొన్నారు.

## ఇజ్రాయెల్‌లో ఉద్యోగాలకు శిక్షణ ప్రారంభం

జగిత్యాల టౌన్, నవంబర్ 12 (ఈవార్తలు): ఇజ్రాయెల్‌లో గల నిర్మాణరంగంలో జిప్సం వర్కర్స్, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్ మరియు బ్లాక్ బిల్డర్స్ ఉద్యోగాల కోసం జగిత్యాల నుంచి టామ్‌కామ్‌లో నమోదు చేసుకున్న 600 మందికి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. అభ్యర్థులకు ప్రాథమిక ఆంగ్లం, కమ్యూనికేషన్ నైపుణ్యానికి సంబంధించిన అంశాలను బోధిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్యమ్మ మాట్లాడుతూ.. సురక్షిత, సులభతర విదేశీ ఉద్యోగాలను అందించడంలో టామ్‌కామ్ ముందు వరసలో ఉందని, ఇది పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తోందని తెలిపారు. అభ్యర్థులు దళారులను నమ్మవద్దని సూచించారు.



## తడి, పొడి చెత్త వేరు చేయాలి

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల, నవంబర్ 12 (ఈవార్తలు): సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కొత్త చెరువును ఆమె బుధవారం పరిశీలించారు. చెరువు కట్ట పైకి వెళ్లి, పరిసరాలు సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువు పరిసరాలు మొత్తం శుభ్రం చేయాలని, చెత్తాచెదారం, చెట్లు తొలగించాలని సూచించారు. ఇక్కడ అవసరమైన యంత్రాలు, సామగ్రిపై ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ ను సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, ఆవరణ పరిసరాలు పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అన్నారు. కంపోస్ట్ షెడ్ ను పరిశీలించి కంపోస్ట్ తయారీ వివరాలను ఆరా తీశారు. డంపింగ్ యార్డుకు కావాల్సిన యంత్రాలు, పరికరాలకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అక్కడి నుండి రైతు బజార్ కి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు బజార్ లో చికెన్, మటన్, చేపలు, కూరగాయల విక్రయాలు పూర్తి స్థాయిలో చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కూరగాయల షెడ్ ను పరిశీలించారు. స్లాటర్ హౌస్ నిర్మించి, చికెన్, మటన్, చేపలు విక్రయాల పూర్తి స్థాయిలో చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇక్కడ సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీవీహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు: సత్యం



మల్యాల, నవంబర్ 12 (ఈవార్తలు): రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై బుధవారం మల్యాల, కొడిమ్యాల మండల రైతులు, రైస్ మిల్లర్లతో జేఎన్టీయూలో కలెక్టర్ సత్యంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17% లోపు వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తేమశాతం వచ్చేవరకు ధాన్యం ఆరబెట్టాలని తెలిపారు. పంట కొన్న వెంటనే రైతుల వివరాలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అందించాలని అన్నారు. కొనుగోలుకు సంబంధించి సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, డిఎస్వో జితేందర్ రెడ్డి, డీసీవో మనోజ్ కుమార్, డీఎం జితేంద్ర ప్రసాద్, ఎమ్మార్వో లు, ఎంపీడీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏబీవీ, కృష్ణకిశోర్‌కు ప్రవీణ్ ప్రకాశ్ క్షమాపణలు

విజయవాడ, నవంబర్ 12 (ఈవార్తలు): వైసీపీ ప్రభుత్వ హయాంలో తాను వ్యవహరించిన తీరుపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణకిశోర్‌కు ఆయన బహిరంగ క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు. గత ప్రభుత్వంలో సర్వీసులో ఉండగా వారి పట్ల తాను అనుచితంగా ప్రవర్తించానని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నానని పేర్కొన్నారు.



# కాలుష్యంతో అల్లాడుతున్న ఢిల్లీ

**వరుసగా మూడో రోజు 400 దాటిన గాలి నాణ్యత.. నగరాన్ని కమ్మేసిన దట్టమైన పొగమంచు.. 5వ తరగతి వరకు విద్యార్థులకు హైబ్రిడ్ బోధన**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయిలోనే కొనసాగుతోంది. వరుసగా మూడో రోజు బుధవారం కూడా గాలి నాణ్యత సూచీ 400 పైన 'తీవ్ర' కేటగిరీలోనే నమోదైంది. నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో చాలా ప్రాంతాల్లో దృశ్యమానత గణనీయంగా పడిపోయింది. దీంతో ప్రజలు స్వచ్ఛమైన గాలి కోసం అల్లాడిపోతున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసిన డేటా ప్రకారం బుధవారం ఉదయం గీతా కాలనీ–లక్ష్మీ నగర్ రోడ్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచీ 413గా నమోదైంది. ఇండియా గేట్, కర్తవ్య పథ్ పరిసరాలను సైతం విషపూరిత పొగమంచు కప్పేయగా, అక్కడ ఏక్యూఐ 408గా ఉంది. నగరంలోని ఇతర ప్రాంతాలైన ఆనంద్ విహార్‌లో 438, అశోక్ విహార్‌లో 439, చాందినీ చౌక్‌లో 449, ద్వారకా సెక్టార్–8లో 422, ఐటీఓలో 433, జహంగీర్‌పురిలో 446, ఆర్‌కే పురంలో 432, రోహిణిలో 442గా గాలి నాణ్యత నమోదైంది. ఇంతటి కాలుష్యానికి ఎక్కువసేపు గురైతే తీవ్రమైన శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్–స్టేజ్ 3 చర్యలను అమలు చేయడంలో భాగంగా 5వ తరగతి వరకు విద్యార్థులకు బుధవారం నుంచి హైబ్రిడ్ విధానంలో తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. "జీఆర్ఏపీ ఫేజ్–3 కింద భద్రతా చర్యలు వేగంగా అమలు చేస్తున్నాం. బుధవారం నుంచి 5వ తరగతి వరకు క్లాసులు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. పాఠశాలల్లో హైబ్రిడ్ విధానం అమల్లో ఉంటుంది" అని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తెలిపారు. ఈ మేరకు ఢిల్లీ విద్యాశాఖ ఒక సర్క్యులర్ జారీ చేసింది. "విద్యాశాఖ, ఎన్‌డీఎంసీ, ఎంసీడీ, ఢిల్లీ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు తక్షణమే 5వ తరగతి వరకు విద్యార్థులకు హైబ్రిడ్ (ఫిజికల్, ఆన్‌లైన్) విధానంలో తరగతులు నిర్వహించాలి. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఈ విధానం కొనసాగుతుంది" అని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఈ కొత్త ఏర్పాట్ల గురించి తల్లిదండ్రులకు వెంటనే తెలియజేయాలని పాఠశాలల యాజమాన్యాలను విద్యాశాఖ డైరెక్టర్ వేదితా రెడ్డి ఆదేశించారు. ఇదిలా ఉండగా.. కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ మంగళవారం ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లోని పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యలపై వివరణాత్మక నివేదికలు సమర్పించాలని ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులను ఆయన ఆదేశించారు.

## తుర్కియే సైనిక విమానం కూలి 20 మంది మృతి

ఇస్తాంబుల్: తుర్కియేకి చెందిన సైనిక కార్గో విమానం తూర్పు జార్జియాలో కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న సిబ్బంది సహా 20 మంది మరణించినట్లు టర్కీ రక్షణ మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. అజర్‌బైజాన్ నుంచి స్వదేశానికి తిరిగి వస్తుండగా మంగళవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తుర్కియే రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, "అజర్‌బైజాన్ నుంచి బయలుదేరిన మా సీ–130 సైనిక కార్గో విమానం జార్జియా–అజర్‌బైజాన్ సరిహద్దు సమీపంలో కూలిపోయింది. విమాన సిబ్బందితో కలిపి మొత్తం 20 మంది ఈ విమానంలో ఉన్నారు" అని తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం గాల్లోనే గింగిరాలు కొడుతూ వేగంగా నేల వైపు దూసుకొచ్చి, భూమిని ఢీకొట్టగానే భారీ మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు అజర్‌బైజాన్ మీడియాలో ప్రసారమయ్యాయి. ప్రమాద స్థలంలో విమాన శకలాలు తగలబడుతూ, దట్టమైన నల్లటి పొగలు కమ్ముకున్న వీడియోలు కూడా వెలువడ్డాయి. ఈ ఘటనపై తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారిని అమరవీరులుగా అభివర్ణించారు. విమాన శకలాలను చేరేందుకు జార్జియా అధికారులతో కలిసి పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నట్లు ప్రభుత్వ వార్తా సంస్థ అనడోలు వెల్లడించింది. అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్ కూడా తుర్కియే అధ్యక్షుడికి సంతాపం తెలుపుతూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో సందేశం పోస్ట్ చేశారు. సహాయక చర్యల గురించి తుర్కియే విదేశాంగ మంత్రి హకాన్ ఫిదాన్, జార్జియా విదేశాంగ మంత్రి మకా బోచోరిష్విలితో ఫోన్‌లో మాట్లాడారు. జార్జియా అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సైతం ఈ ప్రమాదాన్ని ధ్రువీకరించింది. అజర్‌బైజాన్ సరిహద్దుకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలోని సిగ్నాఘి ప్రాంతంలో విమానం కూలిపోయిందని తెలిపింది. జార్జియా గగనతలంలోకి ప్రవేశించిన కొన్ని నిమిషాలకే విమానం రాడార్ నుంచి అదృశ్యమైందని, ఎలాంటి ప్రమాద సంకేతాలు జారీ చేయలేదని దేశ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఏజెన్సీ 'సకేరోనావిగాట్సియా' పేర్కొంది. ఈ సీ–130 హెర్క్యులస్ విమానాన్ని అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ తయారు చేస్తుంది.

# 200 ఐఈడీ బాంబులతో పేలుళ్లు

**దేశవ్యాప్తంగా ఉగ్రవాదుల కుట్ర**

**26/11 తరహాలో భారీ దాడులకు ప్లాన్**

**కుట్ర వెనుక జైషే మహ్మద్ హస్తం**

**2900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం**

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటన దర్యాప్తులో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఇది కేవలం ఒక్క చోటుకే పరిమితమైన దాడి కాదని, 26/11 ముంబయి తరహాలో దేశవ్యాప్తంగా వరుస పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు ఉగ్రవాదులు భారీ కుట్ర పన్నినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం అత్యంత శక్తిమంతమైన 200 ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్) బాంబులను సిద్ధం చేసే పనిలో ఉగ్రవాదులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఉగ్రవాదుల టార్గెట్ లిస్టులో ఎర్రకోటతో పాటు ఇండియా గేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లు, రద్దీగా ఉండే షాపింగ్ మాల్స్‌లోనూ విధ్వంసం సృష్టించాలని పథకం రచించారు. జనవరి నుంచే ఈ కుట్రకు ప్రణాళికలు జరుగుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కుట్ర వెనుక పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ హస్తం ఉందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ దాడుల కోసం పనిచేస్తున్న 'వైద్యుల టెర్రర్ మాడ్యూల్' గుట్టును అధికారులు రట్టు చేస్తున్నారు. ఇటీవలే జమ్మూకశ్మీర్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్‌లలో కేంద్ర ఏజెన్సీలు నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం ఈ కుట్ర తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చేపట్టింది. ఇందుకోసం 10 మంది సభ్యులతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. పేలుడు జరిగిన ప్రాంతం నుంచి సేకరించిన 40 ఫోరెన్సిక్ నమూనాల్లో అమ్మోనియం నైట్రేట్ ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. దర్యాప్తు పురోగతిపై చర్చించేందుకు బుధవారం సాయంత్రం ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్, ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌తో ఉన్నతస్థాయి సమావేశం కానున్నారు. ఈ ఉగ్ర ముఠా సభ్యులు టర్కీలో జైషే హ్యాండ్లర్లతో సమావేశమై కుట్రకు తుదిరూపు ఇచ్చినట్లు కూడా దర్యాప్తులో తేలింది. వాస్తవానికి దీపావళి పండుగ సమయంలోనే జనసమ్మర్థం ఉన్న ప్రదేశాల్లో దాడులు చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, అది విఫలమైంది. ఈ పేలుడు ఘటనలో ఇప్పటివరకు 13 మంది మృతిచెందగా, అనేకమంది గాయపడ్డారు.



# అమెరికన్లు సుద్దమొద్దులు

**మన దగ్గర గొప్ప ప్రతిభ లేదు**

**కొన్ని పరిశ్రమలకు విదేశీ ప్రతిభ అవసరం**

**హెచ్–1బీ వీసాలపై ట్రంప్**

వాషింగ్టన్: హెచ్–1బీ వీసా విధానంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓవైపు ఆయన ప్రభుత్వం ఈ వీసాలపై కఠిన చర్యలు తీసుకుంటుండగా, మరోవైపు దేశంలోని కొన్ని పరిశ్రమలకు విదేశీ ప్రతిభ ఎంతో అవసరమని ఆయన చెప్పడం గమనార్హం. అమెరికాకు కొన్ని ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన నిపుణులు అవసరమని, వారిని విదేశాల నుంచి తీసుకురావాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక ఇంటర్వ్యూలో ట్రంప్‌ను హెచ్–1బీ వీసాలపై ప్రశ్నించారు. మీ ప్రభుత్వం ఈ వీసాలకు ప్రాధాన్యత తగ్గిస్తోందా అని అడగ్గా, ఆయన బదులిస్తూ "దేశంలోకి ప్రతిభను తీసుకురావాల్సిందే" అని అన్నారు. ఇంటర్వ్యూ చేస్తున్న లారా ఇంగ్రహమ్ "మన దగ్గర చాలా ప్రతిభ ఉంది" అనగా, ట్రంప్ వెంటనే "లేదు, మన దగ్గర లేదు" అని బదులిచ్చారు. "నిరుద్యోగ జాబితాలో ఉన్న ఒకరిని తీసుకొచ్చి, ఫ్యాక్టరీలో క్షిపణులు తయారు చేయమని చెప్పలేం కదా? కొన్ని నైపుణ్యాలు మన దగ్గర లేవు. ప్రజలు నేర్చుకోవాలి" అని ట్రంప్ వివరించారు. అయితే, సెప్టెంబర్‌లో ట్రంప్ ప్రభుత్వం హెచ్–1బీ వీసాలపై కఠిన నిబంధనలు విధిస్తూ ఒక ప్రకటన జారీ చేసింది. దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు పెంచింది. దీనికితోడు, గత వారంలో అమెరికా కార్మిక శాఖ 'ప్రాజెక్ట్ ఫైర్‌వాల్' పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా హెచ్–1బీ వీసాలను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలపై సుమారు 175 సంస్థలపై విచారణ జరుపుతోంది. "అమెరికన్ల ఉద్యోగాలను కాపాడేందుకు, హెచ్–1బీ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మా వద్ద ఉన్న అన్ని వనరులనూ ఉపయోగిస్తాం" అని కార్మిక శాఖ కార్యదర్శి లోరీ చావెజ్–డెరెమెర్ తెలిపారు. మరోవైపు ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో హెచ్–1బీ వీసాల వినియోగాన్ని నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. విదేశీ వీసాదారుల స్థానంలో ఫ్లోరిడా నివాసితులను నియమించాలని, ఇది చౌక కార్మిక విధానమని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వ విధానాలపై అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు సంస్థలు కోర్టులో కేసులు వేశాయి. ఐదుగురు చట్టసభ సభ్యులు భారత్–అమెరికా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ట్రంప్‌కు లేఖ రాశారు. ఇదిలా ఉండగా... 2024లో జారీ అయిన మొత్తం హెచ్–1బీ వీసాలలో 70 శాతానికి పైగా భారతీయులే పొందారు. అమెరికాలో నైపుణ్యం కలిగిన వలసదారుల్లో భారతీయుల సంఖ్య ఎక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.

# 68.79 శాతం

## బీహార్‌లో రికార్డు పోలింగ్

**70 ఏళ్ల తర్వాత అత్యధికం**

**అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు**

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ దశలో రికార్డు స్థాయిలో 68.79 శాతం ఓటింగ్ నమోదైనట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వినోద్ సింగ్ గుంజియాల్ వెల్లడించారు. ఇంకా 2,000 పోలింగ్ కేంద్రాల నుంచి పూర్తి సమాచారం రావాల్సి ఉందని, దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. రెండు దశల్లో కలిపి సగటున 66.90 శాతం పోలింగ్ నమోదైందని, ఇది గత అసెంబ్లీ ఎన్నికల కంటే 9.6 శాతం అధికమని ఆయన వివరించారు. 1951–52 ఎన్నికల తర్వాత బీహార్‌లో ఇదే అత్యధిక పోలింగ్ శాతం కావడం గమనార్హం. ఈ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండు దశల్లో కలిపి పురుషుల పోలింగ్ 62.8 శాతంగా ఉండగా, మహిళల పోలింగ్ 71.60 శాతంగా నమోదైంది. ఈసారి ఎన్నికల్లో భద్రతా ఏర్పాట్లు, సాంకేతికత వినియోగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో దశాబ్దాల తర్వాత పోలింగ్ జరగడం చరిత్రాత్మకం. గతంలో భద్రతా కారణాలతో పోలింగ్ కేంద్రాలను తరలించేవారని, కానీ ఈసారి ఒక్క బూత్‌ను కూడా తరలించలేదని అధికారులు తెలిపారు. గయా జిల్లాలోని చకర్బంధా, జముయీ జిల్లాలోని చోర్మారా వంటి గ్రామాల్లో 20 ఏళ్ల తర్వాత ప్రజలు తమ సొంత గ్రామాల్లోనే ఓటు హక్కు వినియోగించుకున్నారని ఏడీజీ కుందన్ కృష్ణన్ తెలిపారు. ఈ ప్రాంతాల్లో 70 శాతం వరకు పోలింగ్ జరగడం విశేషం. రెండో దశ ఎన్నికల కోసం 122 నియోజకవర్గాల్లో 45,399 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి దేశంలోనే తొలిసారిగా 100 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించామని సీఈఓ గుంజియాల్ తెలిపారు. ప్రతి బూత్ లోపల, బయట సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి లైవ్ ఫీడ్‌ను పర్యవేక్షించారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను కూడా వినియోగించారు. ఎన్నికల ప్రక్రియలో మొత్తం 1,625 కంపెనీల కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రూ.127 కోట్ల విలువైన మద్యం, డ్రగ్స్, నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. రెండో దశలో మొత్తం 1,302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.





# భారత్‌కు సంపూర్ణ మద్దతు

**ఉగ్రవాదాన్ని సహించేది లేదు.. భారత్‌కు, మోదీకి అండగా ఉంటాం**

**ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ**

జెరూసలేం: ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కష్టకాలంలో భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి తమ దేశం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. బుధవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా నెతన్యాహు స్పందించారు. "ప్రియ మిత్రుడు నరేంద్ర మోదీకి, ధైర్యవంతులైన భారత ప్రజలకు.. నేను, నా భార్య సారా, ఇజ్రాయెల్ ప్రజల తరఫున బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. ఈ దుఃఖ సమయంలో ఇజ్రాయెల్ మీకు అండగా నిలుస్తుంది" అని వివరించారు. భారత్, ఇజ్రాయెల్ ప్రాచీన నాగరికతలకు నిదర్శనాలని, శాశ్వత సత్యాలపై నిలబడినవని ఆయన పేర్కొన్నారు. "ఉగ్రవాదం మన నగరాలపై దాడి చేయగలదేమో కానీ, మన ఆత్మలను ఎప్పటికీ కదిలించలేదు. మన దేశాల వెలుగు.. శత్రువుల చీకటిని మించి ప్రకాశిస్తుంది" అని నెతన్యాహు తన సందేశంలో ఉద్ఘాటించారు. ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ కూడా ఈ దాడిని ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ, ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తేనే బంగ్లాకు

**షరతు విధించిన ఆ దేశ మాజీప్రధాని షేక్ హసీనా**



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌కు తిరిగి రావడానికి షేక్ హసీనా ఒక షరతు విధించారు. తాను స్వదేశానికి తిరిగి రావాలంటే బంగ్లాదేశ్‌లో అందరి భాగస్వామ్యంతో కూడిన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని ఆమె అన్నారు. గత ఏడాది రిజర్వేషన్ల అల్లర్ల నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చిన షేక్ హసీనా భారతదేశంలో ఒక గుర్తు తెలియని ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. బంగ్లాలో అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఎత్తివేసి, స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలను నిర్వహించినప్పుడే తాను తిరిగి వెళతానని ఆమె స్పష్టం చేశారు. అటువంటి పరిస్థితులనే అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని షేక్ హసీనా పేర్కొన్నారు. ప్రస్తుతం యూనస్ నేతృత్వంలో అధికారంలో ఉన్న తాత్కాలిక ప్రభుత్వం తీవ్రవాద శక్తులకు అధికారం ఇస్తూ భారత్‌తో ఆ దేశ సంబంధాలను ప్రమాదంలో పడేస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు భారతదేశంతో బలమైన సంబంధాలు కొనసాగించామని, యూనస్ ప్రభుత్వం వచ్చాక మూర్ఖత్వంతో వాటిని బలహీనపరుస్తున్నారని ఆమె విమర్శించారు. కష్టకాలంలో తనకు ఆశ్రయం కల్పించినందుకు భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, భారత ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తాను అధికారంలో ఉన్న సమయంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలను పరిష్కరించడంలో విఫలమయ్యానని, దాని నుంచి పాఠాలు నేర్చుకున్నట్లు ఆమె చెప్పారు. అయితే, ఆ సమయంలో విద్యార్థి సంఘాల నాయకులు కూడా బాధ్యత తీసుకుని ఉండాల్సిందని ఆమె అభిప్రాయపడ్డారు. తనపై నమోదైన కేసుల విషయంలో అంతర్జాతీయ న్యాయస్థానంలో హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె అన్నారు. యూనస్ ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను ఆమె ఖండించారు. తనను రాజకీయంగా బలహీనపరిచేందుకే ఇలాంటి ఆరోపణలు చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు కోసం వేట

**కేసు దర్యాప్తును ముమ్మరం చేసిన ఎన్ఐఏ**

**ఢిల్లీ, యూపీ సహా పలు రాష్ట్రాల్లో భద్రత కట్టుదిట్టం**

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద హ్యుందాయ్ ఐ20 కారులో జరిగిన పేలుడు ఘటన దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఉగ్రదాడిలో మరో కారును కూడా వాడినట్లు అనుమానిస్తున్న ఢిల్లీ పోలీసులు, ఎరుపు రంగు ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కారు కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ మేరకు బుధవారం హై అలర్ట్ జారీ చేసి, ఐదు ప్రత్యేక బృందాలతో వేట మొదలుపెట్టారు. ఉగ్రవాదులు ఐ20 కారుతో పాటు మరో ఎరుపు రంగు కారును కూడా వినియోగించినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసు వర్గాలు తెలిపాయి. దీంతో ఢిల్లీలోని అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ పోస్టులు, సరిహద్దు చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. అదేవిధంగా, ఉత్తరప్రదేశ్, హర్యానా పోలీసులకు కూడా ఈ కారుపై సమాచారం అందించి అప్రమత్తం చేశారు. ఈ కేసు దర్యాప్తును కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మంగళవారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఎన్ఐఏ ఏడీజీ విజయ్ సఖారే నేతృత్వంలో 10 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందంలో ఒక ఐజీ, ఇద్దరు డీఐజీలు, ముగ్గురు ఎస్పీ స్థాయి అధికారులతో పాటు డీఎస్పీ ర్యాంక్ అధికారులు కూడా ఉన్నారు. ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. దీనిపై స్పష్టత కోసం 1,000కి పైగా సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అలాగే సోషల్ మీడియా కార్యకలాపాలు, మొబైల్ ఫోన్ డంప్ డేటాను కూడా విశ్లేషిస్తున్నారు.

## పాలన చేతగాక భారత్‌పై నిందలు

**పాక్ ఆరోపణలపై కేంద్రం వివరణ**

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో జరిగిన వరుస పేలుళ్ల వెనుక భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా నిరాధారమైనవని, తమ దేశంలోని అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే పాక్ నాయకత్వం ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తోందని గట్టిగా బదులిచ్చింది. ఇటీవల ఇస్లామాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లో జరిగిన పేలుళ్లపై పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ, ఈ దాడుల వెనుక భారత్ పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని భారత్ ఎన్నడూ ప్రోత్సహించదని, పొరుగు దేశంలో జరిగిన దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. "పాకిస్థాన్ నాయకత్వం చేస్తున్న నిరాధార, అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ దేశంలో జరుగుతున్న సైనిక ప్రేరేపిత రాజ్యాంగ విధ్వంసం, అధికార దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే భారత్‌పై నిందలు మోపుతున్నారు. పాకిస్థాన్ ఇలాంటి తప్పుడు కథనాలను సృష్టించడం కొత్తేమీ కాదు. వాస్తవ పరిస్థితులు ఏంటో అంతర్జాతీయ సమాజానికి బాగా తెలుసు.




## 'కాంత'పై లీగల్ ఫైట్.. రంగంలోకి రానా!

దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి కాంబోలో వస్తున్న 'కాంత' సినిమా రిలీజ్‌కు సరిగ్గా రెండు రోజులు ఉందనగా లీగల్ టెన్షన్ మొదలైంది. ఈ సినిమా 1950ల నాటి తమిళ లెజెండరీ సూపర్ స్టార్ ఎం.కె. త్యాగరాజ భాగవతార్ బయోపిక్ అని, అందులో ఆయన్ను చాలా తప్పుగా, అనైతికంగా చూపించారంటూ.. ఆయన మనవడు చెన్నై కోర్టులో పిటిషన్ వేశాడు. సినిమాను వెంటనే బ్యాన్ చేయాలని డిమాండ్ చేయడంతో కోలీవుడ్‌లో కలకలం రేగింది. ఈ డ్యామేజ్‌ను కంట్రోల్ చేయడానికి ఇప్పుడు ప్రొడ్యూసర్ రానా దగ్గుబాటి స్వయంగా రంగంలోకి దిగాడు. ఈ లాస్ట్ మినిట్ ఫైర్‌ను ఆపడానికి రానా, 'కాంత' టీమ్ నుంచి అఫీషియల్ క్లారిటీ ఇచ్చేశాడు. ఈ సినిమా ఏ ఒక్కరినీ టార్గెట్ చేయడం లేదని స్పష్టం చేశాడు. "మేము ఎవరినీ టార్గెట్ చేయడం లేదు.. కాంత ఒక కల్పిత కథ" అంటూ రానా అఫీషియల్ హ్యాండిల్ నుంచి ట్వీట్ చేశాడు ఈ ఒక్క స్టేట్‌మెంట్‌తో, ఇది బయోపిక్ కాదని, కాబట్టి ఎవరి పర్మిషన్లూ అవసరం లేదని లీగల్‌గా సేఫ్ అయ్యే ప్రయత్నం చేశారు.






## బెట్టింగ్ జోలికి వెళ్లకండి


బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ లో భాగంగా ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ఈడీ ముందు విచారణకు హాజరయ్యి.. తమ వాదనలు వినిపించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు రంగంలోకి సీఐడీ దిగింది. అందులో భాగంగానే నిన్న విజయ్ దేవరకొండ సీఐడీ విచారణకు హాజరు కాగా.. బుధవారం ప్రకాష్ రాజ్ హాజరయ్యారు. సీఐడీ విచారణ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన బెట్టింగ్ యాప్స్ పై అలాగే సీఐడీ విచారించిన పలు అంశాలపై.. అధికారులు అడిగిన ప్రశ్నలకు ప్రకాష్ రాజ్ ఏ విధంగా సమాధానమిచ్చారు ఇలా పలు విషయాలపై స్పందించారు. ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ.. "అధికారులు నోటీసులు ఇచ్చిన విధంగానే మనం సీఐడీ ఎదుట విచారణకు హాజరయ్యాను. బెట్టింగ్ యాప్స్ తో జరిపిన బ్యాంక్ స్టేట్మెంట్స్ అన్నింటినీ కూడా గతంలోనే సమర్పించాను. 2016లో బెట్టింగ్ యాప్ కి ప్రమోట్ చేశాను. అయితే నేను ప్రమోట్ చేసిన యాప్ ను 2017 లో నిషేధించారు. దయచేసి బెట్టింగ్ యాప్స్ ఎవరు వాడకండి. యువత ఈ బెట్టింగ్ యాప్ జోలికి అసలే వెళ్లకండి .ముఖ్యంగా అడ్డదారిలో వెళ్ళకండి. తెలిసి చేసినా తెలియక చేసిన తప్పు తప్పే కదా. ఈ బెట్టింగ్ యాప్ నిర్వహకులకు సంబంధించిన సమాచారాన్ని నేను సిఐడి విచారణలో అందించాను. అయితే నేను ప్రమోట్ చేసిన యాప్ మొదట గేమింగ్ యాప్ అనుకొని ప్రమోట్ చేసాము. కానీ బెట్టింగ్ యాప్ అనుకొని తర్వాత దానిని వదిలేసాను. ఇతర కంపెనీలకు ఎక్కడా కూడా నేను ఇలా ప్రమోషన్ చేయలేదు. దయచేసి బెట్టింగ్ యాప్స్ ఎవరూ కూడా ఉపయోగించకండి. డబ్బులు పెట్టి అసలు బెట్టింగ్ చేయకండి. ప్రజలు, యంగ్ స్టార్స్ కచ్చితంగా అర్థం చేసుకోవాలి. ఇప్పటికే ఈ బెట్టింగ్ యాప్స్ లో డబ్బులు పెట్టుబడిగా పెట్టి ప్రాణాలు కూడా కోల్పోయారు. ఇది చాలా అత్యంత దారుణమైన పరిస్థితి దయచేసి ఎవరూ కూడా బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేయకండి" అని పేర్కొన్నాడు.

## మీనాక్షి నిర్ణయం కరక్టేనా?

సీనియర్ హీరోలతో నటించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదంటూ ముందుకొచ్చింది..మీనాక్షి చౌదరి. అలా నటించడాన్ని తాను ఓ కొత్త జోనర్ గానే భావిస్తానంది. ఓ రకంగా మేకర్స్ కు ఇది కాస్త ఊరటనిచ్చే విషయమే. 30 ఏళ్ల నాయికలెవరు? సీనియర్లతో అంటే ముందుకురారు. కానీ మీనాక్షి లాంటి ఫేమస్ అయిన నటి వచ్చిందంటే హర్షించదగ్గ విషయమే. ఆమె ఎలాంటి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకుంది? అన్నది పక్కన బెడితే నటిగా మాత్రం పెద్దగా నిబంధనలు పెట్టుకోకుండానే పనిచేస్తుందని చెప్పొచ్చు. 'లక్కీ భాస్కర్' చిత్రంలో అమ్మడు పిల్లల తల్లిగానూ నటించిన సంగతి తెలిసిందే. అలాగే %-%సంక్రాంతి వస్తున్నాం%-% సినిమాలో వెంకీ గాళ్ ఫ్రెండ్ పాత్రలోనూ అలరించింది. ఇలా మీనాక్షి వచ్చిన అవకాశాలు వదులుకోకుండా సద్వినియోగం చేసుకుంది. యంగ్ హీరోలే కావాలంటూ కూర్చోలేదు. మంచి అవకాశం...గొప్ప పాత్ర అనుకున్న ప్రతీ సినిమా చేసింది.



# రీరిలీజ్‌ల నవంబర్







ఈ మధ్య ఇండస్ట్రీలో రీరిలీజుల ట్రెండ్ బాగా పెరిగిపోయింది. ఆల్రెడీ రిలీజైన హిట్ సినిమాలు మాత్రమే కాకుండా ఒకప్పుడు రిలీజై ఫ్లాపైన, క్లాస్ స్టేటస్ తెచ్చుకున్న సినిమాలను కూడా ఇప్పుడు రీరిలీజ్ చేసి దాన్ని నిర్మాతలు క్యాష్ చేసుకుంటున్నారు. ఇప్పటికే ఎన్నో సినిమాలు రీరిలీజై మంచి ఫలితాల్ని అందుకోగా నవంబర్ నెలలో మరిన్ని సినిమాలు రీరిలీజ్ కాబోతున్నాయి. నవంబర్ నెలలో దుల్కర్ సల్మాన్ కాంత, ఎనర్జిటిక్ స్టార్ పోతినేని ఆంధ్రా కింగ్ తాలూకా తప్ప చెప్పుకోదగ్గ కొత్త సినిమాలేమీ లేకపోవడంతో పాత సినిమాలే రీరిలీజులవుతున్నాయి. కాకపోతే ఈసారి రీరిలీజులు ఆడియన్స్ కు కాస్త ఇంట్రెస్ట్ ను కలిగిస్తున్నాయి. తెలుగు సినిమాను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లిన శివ సినిమా ఈ నెల 14న రిలీజ్ కానుంది. నాగార్జున హీరోగా రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఆ రోజుల్లోనే కల్ట్ స్టేటస్ ను తెచ్చుకుంది. నవంబర్ 15న ప్రభుదేవా దర్శకత్వంలో సిద్దార్థ్ నువ్వొస్తానంటే నేనొద్దంటానా మూవీ రీరిలీజ్ కాబోతుంది. నవంబర్ 21న మెగాస్టార్ చిరంజీవి కొదమసింహం రీరిలీజ్ కానుంది. 1990లో మెగాస్టార్ ఫస్ట్ కౌబాయ్ సినిమాగా ఈ సినిమాకు మంచి ఫాలోయింగ్ ఉన్నప్పటికీ కమర్షియల్ గా మాత్రం భారీ సక్సెస్ సాధించలేదు. కానీ తర్వాతర్వాత ఈ సినిమాకు మంచి కల్ట్ స్టేటస్ వచ్చి, మెగా ఫ్యాన్స్ కు మోస్ట్ ఫేవరెట్ సినిమాల్లో ఒకటిగా నిలిచింది. గతంలో ఓ సారి షెడ్యూల్ చేసి పోస్ట్ పోన్ అయిన కార్తీ ఆవారా నవంబర్ 22న తమిళ వెర్షన్ తో పాటూ తెలుగులో కూడా రీరిలీజ్ కాబోతుంది. ఆ తర్వాత వారం నవంబర్ 28న సూర్య సికందర్ డిజాస్టర్ సినిమాను రీ ఎడిట్ చేసి కొత్త ఆడియన్స్ కు సరికొత్త ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా ఆ మూవీని రీరిలీజ్ చేస్తున్నారు. ఇక నెలాఖరుకి సూపర్ స్టార్ మహేష్ బాబు బిజినెస్ మ్యాన్ నవంబర్ 29న రిలీజ్ కానుంది.

## స్పిరిట్‌లో మెగాస్టార్.. సందీప్ రెడ్డి క్లారిటీ

టాలీవుడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తన తర్వాతి సినిమాను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. రీసెంట్ గా ఈ సినిమా నుంచి ఓ ఆడియో టీజర్ రిలీజ్ చేసి సినిమాపై భారీ బజ్ ను క్రియేట్ చేశారు సందీప్ రెడ్డి వంగా. స్పిరిట్ టీజర్ తో కేవలం టాలీవుడ్ లోనే కాకుండా బాలీవుడ్ లో కూడా మంచి హైప్ ను అందుకోగలిగారు. స్పిరిట్ సినిమా ఇంకా సెట్స్ పైకి కూడా వెళ్లకుండానే భారీ అంచనాలు నెలకొనగా, గత కొన్నాళ్లుగా ఈ సినిమా పై ఓ క్రేజీ రూమర్ నెట్టింట వినిపిస్తోంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి స్పిరిట్ సినిమాలో నటించనున్నారని, ఈ సినిమాలో ఆయన ప్రభాస్ కు తండ్రి పాత్రలో కనిపిస్తారని వార్తలు రావడంతో స్పిరిట్ పై ఉన్న హైప్ ఇంకాస్త పెరిగింది. అయితే ఈ వార్తలపై రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో సందీప్ రెడ్డి వంగా క్లారిటీ ఇచ్చారు. స్పిరిట్ మూవీలో చిరంజీవి ప్రభాస్ తండ్రిగా చేయడం లేదని, అసలు స్పిరిట్ సినిమాలో చిరంజీవి గారు ఏ పాత్రలోనూ కనిపించబోవడం లేదని, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ పుకార్లేనని చెప్పారు. అయితే తాను చిరంజీవితో కలిసి వేరే సినిమా చేస్తానని సందీప్ క్లారిటీ ఇచ్చారు.





## అందుకే వరుస సినిమాలు చేయలేదు: అను ఇమ్మాన్యుయేల్

ఇన్ని రోజులు సరైన సక్సెస్ కోసం ఎదురుచూసిన అను ఇమ్మాన్యుయేల్.. తాజాగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ది గర్ల్ ఫ్రెండ్ అనే సినిమాలో హీరోయిన్ ఫ్రెండ్ దుర్గా పాత్రలో అద్భుతంగా నటించి ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ సినిమా చూసిన తర్వాత టాక్సిక్ రిలేషన్స్ ఉన్న ఈ జనరేషన్లో ఇలాంటి ఒక ఫ్రెండ్ ఖచ్చితంగా ఉండాలి అని అటు అభిమానులు కూడా కామెంట్లు చేసిన విషయం తెలిసిందే. అంతలా ప్రతి ఒక్కరికి ఈ పాత్ర కనెక్ట్ అయిపోయింది. ఈ పాత్రతో అందరిని ఆకట్టుకుంది అను ఇమ్మానుయేల్. ఇదిలా ఉండగా ది గర్ల్ ఫ్రెండ్ సినిమా కోసం హైదరాబాద్ వచ్చిన ఈమె ఇంటర్వ్యూలో పాల్గొని.. ఇన్ని రోజులు ఎందుకు సినిమాలకు దూరంగా ఉంది అనే విషయంపై ప్రస్తావిస్తూ.. "ఈ సినిమా నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మిక, దీక్షిత్ జంటగా నటించారు.





## రేపటి నుంచే
# సఫారీలతో టెస్టులు

**సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరగనున్న రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమవుతోంది. కోల్‌కతా వేదికగా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్ట్‌లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)2025-27లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్‌లో విజయమే లక్ష్యంగా ఇరు జట్లు సన్నదమవుతున్నాయి.**

ఈ సిరీస్‌లో గెలిచిన జట్లకు డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు మెరుగవనున్నాయి. దాంతో ఈ సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వన్డే, టీ20 ఫార్మాట్‌లో అద్భుత విజయాన్నందుకున్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. టెస్ట్‌ల్లో మాత్రం ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోయాడు. హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన కొత్తలోనే సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టీమిండియా 3-0తో క్లీన్ స్వీప్ అయ్యింది. భారత క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై ఓ టెస్ట్ సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ కావడం ఇదే తొలిసారి. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలోనూ ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కోల్పోయింది. ఈ పరాజయాలతో డబ్ల్యూటీసీ 2025 ఫైనల్ చేరలేకపోయింది. ఈ క్రమంలోనే సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ గంభీర్ కోచింగ్‌కు సవాల్‌గా మారింది. తాజా డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఇంగ్లండ్ పర్యటనతో పాటు వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ గెలిచి జోరు మీద ఉంది. ఈ సిరీస్‌కు స్టార్ స్పోర్ట్స్‌తో పాటు జియో హాట్‌స్టార్ అధికారిక బ్రాడ్‌కాస్టర్‌గా వ్యవహరిస్తుంది. భారత్, సౌతాఫ్రికా సిరీస్ మ్యాచ్‌లు ఈ రెండు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.

### షెడ్యూల్:

**తొలి టెస్ట్: నవంబర్ 14- 18 వరకు (కోల్‌కతా)**

**రెండో టెస్ట్: నవంబర్ 22-26 వరకు(రాంచీ)**

### భారత్ జట్టు:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, ఆకాశ్ దీప్.

### సౌతాఫ్రికా జట్టు..

టెంబా బవుమా (కెప్టెన్), డివాల్డ్ బ్రెవిస్, ఎయిడెన్ మార్‌క్రమ్, కార్బిన్ బాష్, డి జోర్జి, జుబేర్ హంజా, సైమన్ హార్మర్, మార్కో యాన్సెన్, కేశవ్ మహారాజ్, ముల్డర్, ముత్తుసామి, రబాడ, రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెరిన్నే.



## నితీశ్ కాదు.. జురెల్

**ఆల్‌రౌండర్‌కు తుది జట్టులో చోటు కష్టమే**

**టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే**

రిషభ్ పంత్ గౌర్హాజరీలో ధ్రువ్ జురెల్ మెరుగ్గా రాణించాడు. వెస్టిండీస్‌తో సెంచరీ చేయడంతో పాటు సౌతాఫ్రికా-ఏతో రెండో అనధికార టెస్ట్‌ల్లో రెండు శతకాలు నమోదు చేశాడు. ప్రస్తుతం ధ్రువ్ జురెల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. తుది జట్టులోకి తీసుకోవాలని ఫ్యాన్స్‌తో పాటు మాజీ క్రికెటర్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇద్దరు వికెట్ కీపర్లతో బరిలోకి దిగితే తుది జట్టులో నుంచి ఎవర్ని తప్పించాలనేది చర్చనీయాంశంగా మారింది. సాయి సుదర్శన్‌ను పక్కన పెట్టాలనే డిమాండ్ వ్యక్తమైంది. కానీ టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే మాత్రం నితీష్ కుమార్ రెడ్డి స్థానంలో ధ్రువ్ జురెల్ బరిలోకి దిగుతాడని హింట్ ఇచ్చాడు. తొలి టెస్ట్ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన డస్కాటే.. నితీష్ కుమార్ రెడ్డి తొలి టెస్ట్ ఆడే అవకాశం లేదన్నాడు. 'నితీష్ కుమార్ రెడ్డి విషయంలో మా వైఖరి మారలేదు. ఆస్ట్రేలియా పర్యటనలో అతనికి అవకాశం దక్కలేదు. కానీ సౌతాఫ్రికాతో సిరీస్ నేపథ్యంలో నెలకొన్న పోటీ కారణంగా అతనికి తుది జట్టులో ఆడే అవకాశం దక్కదని నేను భావిస్తున్నాను. బ్యాటింగ్ డెప్త్, స్పెషలిస్ట్ బౌలర్లతో జట్టును సమతూకంగా ఉంచుకోవడం కీలకం. కేవలం ఒక ఆల్‌రౌండర్ కోసం స్పెషలిస్ట్ ప్లేయర్‌ను పక్కనపెట్టాలని మేం అనుకోవడం లేదు. ధ్రువ్ జురెల్‌ను తుది జట్టులో ఆడుతాడు. అతను సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ధ్రువ్ జురెల్, రిషభ్ పంత్ ఇద్దరూ బరిలోకి దిగుతారు.

## రషీద్ ఖాన్ రెండో పెళ్లి?

అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టు స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తన రెండో పెళ్లి విషయంపై వార్తల్లో నిలిచారు. సోషల్ మీడియాలో ఓ మహిళతో రషీద్ ఖాన్ దిగిన ఫోటో వైరల్ అవుతుండటంతో ఆయన స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా దీనిపై స్పష్టతనివ్వాల్సి వచ్చింది. రషీద్ ఖాన్ ఈ ఏడాది ఆగస్టులోనే వివాహం చేసుకున్నట్లు సమాచారం. నెదర్లాండ్స్‌లో జరిగిన ఒక చారిటీ ఈవెంట్ ప్రారంభోత్సవానికి రషీద్ ఖాన్ వెళ్లారు. ఈ కార్యక్రమంలోనే రషీద్‌తో పాటు ఆ మహిళ కూడా కనిపించారు. ఈ ఫొటో బయటకు రాగానే రకరకాల చర్చలు మొదలయ్యాయి. దాంతో రషీద్ ఖాన్ స్వయంగా ఆమె తన భార్య అని ప్రపంచానికి తెలియజేశారు. అయితే ఆమె ఆయన రెండో భార్యా? అనే విషయంలో గందరగోళం కొనసాగుతోంది. రషీద్ ఖాన్ తన వైరల్ ఫొటోపై ఇచ్చిన వివరణ కారణంగానే ఈ గందరగోళం మరింత పెరిగింది. తన పోస్ట్‌లో రషీద్ ఖాన్ ఇలా రాసుకొచ్చారు. "2 ఆగస్టు 2025న నా జీవితంలో కొత్త ప్రారంభం జరిగింది. నాకు నిఖా జరిగింది. నేను ఎల్లప్పుడూ కోరుకునే ప్రేమ, శాంతి, భాగస్వామ్యాన్ని సూచించే ఒక మహిళను వివాహం చేసుకున్నాను. ఛారిటీ ఈవెంట్‌కు తీసుకువెళ్లాను, రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.



## అండర్ 19 కెప్టెన్‌గా హైదరాబాదీ

అఫ్గానిస్థాన్ అండర్ 19 జట్టుతో జరిగే ముక్కోణపు సిరీస్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) రెండు జట్లను ప్రకటించింది. అండర్ 19 భారత్-ఏ, అండర్ 19 భారత్-బీ జట్లు అఫ్గానిస్థాన్ అండర్ 19 టీమ్‌తో ముక్కోణపు సిరీస్ ఆడనుంది. అండర్ 19 ఏ జట్టుకు విహాన్ మల్హోత్రా సారథ్యం వహిస్తుండగా.. అండర్ 19 బీ జట్టుకు సారథ్యం వహించే అవకాశం హైదరాబాద్ కుర్రా ఆరోన్ జార్జ్‌కు దక్కింది. ఆరోన్ జార్జ్ ఇటీవల ముగిసిన ప్రతిష్ఠాత్మక దేశవాళీ అండర్ 19 టోర్నీ వినూ మన్కడ్ ట్రోఫీలో హైదరాబాద్ జట్టుకు సారథ్యం వహించాడు. అసాధారణ ప్రదర్శన, సారథ్యంతో హైదరాబాద్ జట్టును విజేతగా నిలబెట్టాడు. ఆరోన్ గత కొంతకాలంగా మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. వినూ మన్కడ్ ట్రోఫీలో అతను గత మూడేళ్లుగా టాప్ స్కోరర్‌గా నిలుస్తూ వచ్చాడు. ఇటీవల ముగిసిన ఎడిషన్‌లోనే 2 సెంచరీల సాయంతో 373 పరుగులు చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న అండర్ 19 చాలెంజర్ ట్రోఫీలో కూడా అతను నిలకడైన ప్రదర్శన చేస్తున్నాడు. స్కూల్ క్రికెట్‌లో సత్తా చాటిన ఆరోన్ జార్జ్‌కు 2022లో హైదరాబాద్ అండర్ -16 జట్టులో చోటు దక్కింది. విజయ్ మర్చంట్ ట్రోఫీలో సత్తా చాటిన అతను ఒక ట్రిపుల్ సెంచరీతో పాటు 511 పరుగులు సాధించాడు. ఈ ప్రదర్శనతో ఆరోన్‌కు మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం అతను హైదరాబాద్‌లోని భవాన్స్ కాలేజీలో బీకామ్ మొదటి ఏడాది చదువుతున్నాడు.

## రో-కో దేశవాళీ క్రికెట్ ఆడాలి

టీమిండియా మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఈ స్టార్ ఆటగాళ్లు కేవలం వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నారు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడాలనే లక్ష్యంతో ఉన్నారు. ఇందుకోసం ఇద్దరు ఆటగాళ్లు తీవ్రంగా కష్టపడుతున్నారు. ఫిట్‌నెస్‌పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టిన రోహిత్ శర్మ ఏకంగా 12 కిలోల బరువు తగ్గాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఈ ఇద్దరూ ఆటగాళ్లు సత్తా చాటారు. అయితే ఈ వన్డే సిరీస్‌లో టీమిండియా ఓటమిపాలైంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన కోహ్లీ.. ఆఖరి వన్డేలో అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. మరోవైపు తొలి వన్డేలో హాఫ్ సెంచరీ చేసిన రోహిత్.. ఆఖరి వన్డేలో సెంచరీ సాధించాడు. ప్రస్తుతం ఈ ఇద్దరూ వన్డే ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతుండటంతో మ్యాచ్ ప్రాక్టీస్ కోసం దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ ఆదేశించినట్లు తెలుస్తోంది. 'భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలంటే దేశవాళీ క్రికెట్ ఆడాలని కోహ్లీ, రోహిత్‌లకు బీసీసీఐతో పాటు టీమ్‌మేనేజ్‌మెంట్ సూచించింది. రెండు ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరూ ఆటగాళ్లు మ్యాచ్ ఫిట్‌నెస్‌తో పాటు ప్రాక్టీస్ సాధించేందుకు దేశవాళీ క్రికెట్ ఆడాలని కోరింది.'అని ఓ బీసీసీఐ అధికారి మీడియాతో అన్నారు. అందుబాటులో ఉన్న భారత ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఆడాలని గతంలోనే బీసీసీఐతో పాటు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆదేశించారు. రోహిత్ శర్మ దేశవాళీ క్రికెట్ ఆడుతానని ముంబై జట్టుకు సమాచారమిచ్చినట్లు తెలుస్తోంది.





## భారత్-దక్షిణాఫ్రికా టెస్టుకు భారీ భద్రత

దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఎర్రకోట సమీపంలో కారులో బ్లాస్ట్ జరిగింది. ఈ ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. అయితే, ఈ నెల 14 నుంచి కోల్‌కతా వేదికగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య టెస్టు మ్యాచ్ జరుగనున్నది. ఢిల్లీ ఘటన నేపథ్యంలో ఈడెన్ గార్డ్స్, కోల్‌కతాలో భద్రతను కట్టుదిట్టం చేశారు. శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న టెస్టుకు ఆతిథ్యం ఇవ్వనున్న ఐకానిక్ స్టేడియంతో నగరంలోని కీలక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మ పేర్కొన్నారు. తామంతా హై అలెర్ట్‌లో ఉన్నామని.. ఢిల్లీ పేలుడును దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక, అదనపు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక పోలీసులతో పాటు స్పెషల్ టాస్క్ ఫోర్స్ ను మోహరించనున్నారు. లాల్‌బజార్‌లోని పోలీస్ వర్గాలు ఈడెన్ గార్డెన్స్ వద్ద మూడు అంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. స్టేడియం చుట్టూ, ఎంట్రీ గేట్స్, ప్రేక్షకుల స్టాండ్స్‌ను కవర్ చేయడంతో పాటు మైదానం చుట్టుపక్కల కదలికలను కఠినంగా పర్యవేక్షించనున్నారు. మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్‌హెల్డ్ స్కానర్స్‌లను ఉపయోగించి ముమ్మరంగా తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. స్టేడియం లోపల, వెలుపల సాధారణ దుస్తులు ధరించిన పోలీసులు సిబ్బందిని మోహరిస్తామని.. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించి వేగంగా స్పందించనున్నట్లు అధికారులు చెప్పారు. బ్యాగులు, నిషేధిత వస్తువులతో స్టేడియంలోపలికి అనుమతి ఉండదని పోలీసులు పేర్కొన్నారు. శాసనసభ, రాజ్‌భవన్, కోల్‌కతా హైకోర్టు, స్టేడియం దగ్గరగా ఉన్న ఆల్ ఇండియా రేడియో చుట్టూ భద్రతను సైతం పెంచారు. ప్రోటోకాల్స్‌ను విషయంలో సమీక్ష చేసేందుకు బెంగాల్ క్రికెట్ అసోసియేషన్, సీనియర్ పోలీసు అధికారుల మధ్య సమావేశం జరిగింది. దాంతో పాటు భారత జట్టు, దక్షిణాఫ్రికా జట్లు బస చేసిన హోటల్స్ వద్ద సైతం నిఘాను పెంచారు. భారత కోచ్ గౌతమ్ గంభీర్ కాళీఘాట్ ఆలయానికి వెళ్లాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



# ప్రభుత్వం మీ ఆస్తిని తీసుకోవచ్చా?

భూసేకరణలో ప్రభుత్వం ప్రజల భూమిని తీసుకోవచ్చు, కానీ కఠినమైన చట్టబద్ధమైన నిబంధనలు పాటించాలి. 2013 ఎల్ఏఆర్ఆర్ చట్టం ద్వారా భూమి యజమానులకు తగిన పరిహారం, పునరావాసం అందించబడుతుంది. ఈ రోజుల్లో దేశంలో రోడ్లు, రైల్వేలు, పెద్ద ప్రాజెక్టులు, ఇండస్ట్రీలు వేగంగా పెరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వం ఎంతోమంది పౌరుల భూములను భవిష్యత్తు అభివృద్ధి కోసం తీసుకుంటోంది. అయితే, చాలామంది ప్రశ్నిస్తారు. "ప్రభుత్వం మీ అనుమతి లేకుండా మీ భూమిని తీసుకోవచ్చా?" అనే దానికి సమాధానం కొన్ని పరిస్థితుల్లో అవును. కానీ ఇది ఇలా వచ్చేసేది కాదు, ప్రభుత్వం కొన్ని కఠినమైన చట్టబద్ధమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది.

భూసేకరణ అనగా ప్రభుత్వం లేదా దానికి అధీనమైన ఏ సంస్థ ప్రజల నుండి వారి భూమిని తీసుకోవడం. ఇది సాధారణంగా రోడ్లు, రైల్వేలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పారిశ్రామిక ప్రాజెక్టులు వంటి ప్రజా ప్రయోజనాల కోసం జరుగుతుంది. అయితే, ఎవరూ తమ భూమిని తక్కువ చెల్లింపుతో లేదా బలవంతంగా ఇవ్వాలని ఆశించరు. అందుకే భారత ప్రభుత్వం, రాజ్యాంగం, చట్టాలు ఈ ప్రక్రియను నియంత్రిస్తాయి. భారతదేశంలో భూసేకరణ చట్టాన్ని 1894లో మొదట ప్రవేశపెట్టారు. ఆ చట్టం చాలా కాలం పాటు ఉపయోగించబడింది, కానీ అది ప్రజలకు తగిన న్యాయం అందించలేదు. అందుకే 2013లో కొత్త చట్టం తీసుకొచ్చారు. అదే భూమి సేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం. ఈ చట్టం ద్వారా భూమి సేకరణలో పారదర్శకత ఉంటుంది. భూమి యజమానులకు వారి హక్కులు కాపాడబడతాయి. వారికి తగిన పరిహారం, పునరావాసం అందించబడుతుంది. భూసేకరణలో ప్రజల సమ్మతిని పొందటం ప్రాధాన్యం కలిగి ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 300-ఏ ప్రకారం, ప్రభుత్వం ప్రజా ప్రయోజనం కోసం భూమిని తీసుకోవడానికి హక్కు కలిగి ఉంటుంది. కొత్త రోడ్లు, జల సంక్షేమ ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పారిశ్రామిక కేంద్రాలు, ఇతర కీలక పథకాలు.. ఇలా ప్రజలకు లాభకరంగా ఉండే పనులకు భూమిని ప్రభుత్వం సేకరిస్తుంది. భూమి తీసుకునే సమయంలో ప్రజల సమ్మతి లేకపోయినా భూమి తీసుకోవచ్చు కానీ తగిన పరిహారం తప్పనిసరి. ప్రైవేట్ కంపెనీలకు, అంటే ప్రైవేట్ రంగ ప్రాజెక్టులకు భూమి సేకరణ కోసం తక్కువగా 70% భూమి యజమానుల రాత సమ్మతి తీసుకోవాలి. ఇది భూమి యజమానుల హక్కుల రక్షణకు ముఖ్యమైన నియమం. సుప్రీంకోర్టు తరచూ భూసేకరణ అంశాలను కఠినంగా చూసి, ప్రజల హక్కులను రక్షిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం చట్టపరమైన ప్రక్రియ పాటించకపోతే, పరిహారం ఇవ్వకపోతే భూమిని బలవంతంగా తీసుకోవడం రాజ్యాంగ ఉల్లంఘన కిందికి వస్తుందని స్పష్టం చేసింది. భూసేకరణ ప్రజా ప్రయోజనానికి మాత్రమే ఉండాలిబీ అధికారం సాధించడానికి కాకుండా సామాజిక సమ్మత, పారదర్శకత ఉండాలి. సింగూర్ కేసు (పశ్చిమ బెంగాల్) కేసులో టాటా మోటార్స్ కోసం భూమి సేకరణను సుప్రీంకోర్టు చట్టవిరుద్ధంగా ప్రకటించి రైతులకు తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. భూ సేకరణలో మీకు అన్యాయం జరిగితే కోర్టులో దరఖాస్తు చేయవచ్చు. అయితే, భూసేకరణలో మీ హక్కులు, ఆప్షన్లు తెలుసుకోవడం చాలా ముఖ్యం. ప్రతి వ్యక్తికి న్యాయం కావాలి, ప్రభుత్వం ప్రజల హక్కులను గౌరవించాలని భావిస్తాం. భూమి సేకరణ చట్టం, సుప్రీంకోర్టు తీర్పులు అన్నీ ఈ హక్కులను బలపరిచే విధంగా ఉన్నాయి. భూమి సేకరణ ప్రజా అభివృద్ధికి అవసరం అయినా, అది చట్టపరమైన నియమాలను పాటించి, ప్రజల హక్కులను గౌరవిస్తూ, సరైన పరిహారం, పునరావాసం అందిస్తూ జరగాలి.

# దయ.. కరుణ

## ..నేడు ప్రపంచ దయ దినోత్సవం...



**భారతీయతకు ధర్మం ఆధారం. ధర్మం అనే శబ్దానికి.. ఆచారం, నీతి, న్యాయం, పుణ్యం, యజ్ఞం, వేదోక్తవిధి, సత్కార్యం, స్వభావం ఇలా అనేక అర్థాలు చెప్తారు. భారతి అనగా సరస్వతి అని అర్థం. ఈ సంస్కృతి ఒక సరస్వతీ నదీ ప్రవాహం వంటిది. దీని తీరంలో ఎందరో మహర్షులు ఆశ్రమాలు నిర్మించుకొన్నారు. ఆ సరస్వతీ నది ఎలా అంతర్వాహినిగా ప్రవహించిందో అలాగే మన భౌతిక ఆధ్యాత్మిక క్రియలన్నింటికీ ధర్మం ఆధారం.**

ధరించేంది ధర్మం అని పెద్దలు చెప్తారు. ధర్మమే ప్రజల్ని నిలిపి ఉంచుతుంది. అయితే ధర్మవృక్షానికి వేర్లు దయ, కరుణ అనే గొప్ప గుణాలు. సంప్రదాయాలు మొత్తం ఆ వృక్షం పై భాగంలో కొమ్మలు మనకు లోపలున్న వేర్లు కన్పించవు. అందుకే చెట్టును నరికేసి వట్టిపోయిన కర్రలను అందమైన వస్తువులుగా మార్చి వాడుతుంటాం. అలాగే ధర్మం యొక్క మూల స్వరూపం తెలియకుండా ఆ వేర్లలోని సజీవరూపాలైన దయ, కరుణను వదిలేసి పైనున్న అందమైన వృక్షాన్ని వర్ణిస్తాంబీ వల్లిస్తాం. మహనీయులు దీనికి అతీతంగా జీవిస్తారు. ధర్మ సంబంధమైన ఏ విషయమైనా దాని వెనుకున్న దయ, కరుణను పట్టుకోవాలి. ప్రతినియమం, ఆచారం, సంప్రదాయం, ఆధ్యాత్మిక ప్రక్రియల ప్రధాన ఉద్దేశమే అది.

# కలమే కాళోజీ ఆయుధం



'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి.. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి.. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని గర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. తెలంగాణ కోసం, ఇక్కడి ప్రజల హక్కుల కోసం పోరాడిన మహావ్యక్తి. పుట్టుక, చావు తప్ప బతుకంతా తెలంగాణకిచ్చిన మహనీయుడు. తన భావాలను తెలంగాణ యాసలో.. సులభంగా అర్థమయ్యే భాషలో చెప్పేవారు. 1930 నుంచే కాళోజీ నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్‌లో ఎంతో చురుగ్గా పనిచేయడం ప్రారంభించారు. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని పాతికేళ్ల వయసులోనే జైలుశిక్ష అనుభవించారు.

మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పీవీ నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించి నగర బహిష్కరణకు గురయ్యారు. 1953లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1958లో టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి శాసనమండలికి ఎన్నికయ్యారు. కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది. ప్రశ్నించేవాడు నాకు ఆరాధ్యుడు అని ఆయన సగర్వంగా ప్రకటించారు.

ఏ భాష నీది ఏమి వేషమురా
ఈ భాష ఈ వేషమెవరి కోసమురా
ఆంగ్లమందున మాటలనగానే
ఇంత కుల్కెదవెందుకు రా
తెలుగువాడివై తెలుగు రాదనుచు
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా
అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు
సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా!'

ఇతర భాషలపై మోజుతో మాతృభాషను విస్మరించేవారిని కాళోజీ కంటే గొప్పగా ఎవరు హెచ్చరిస్తారు. అందుకే ఆయన జయంతి 'తెలంగాణ భాషా దినోత్సవం ' అయింది. తెలుగు భాష పట్ల ఆ ప్రజాకవికి ఉన్న మమకారం ఎనలేనిది. కాళన్న కాస్త పరుషంగానే హెచ్చరించినా.. అది తెలుగుదనం పట్ల ఆయనకున్న అనంతమైన అపేక్ష మాత్రమే గానీ మరొకటి కాదు. కాళోజీ అనగానే మొదట గుర్తొచ్చేది... 'నా గొడవ'. 'నా గొడవ' అంటే ఆయన వ్యక్తిగతమైన సమస్య కాదు. సమకాలీన సమాజంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని, వాటిని అధిక్షేపిస్తూ అవన్నీ 'నా గొడవ' అన్నారు కాళోజీ. 'అవనిపై జరిగేటి అవకతవకలకు ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు' అంటూ.. ప్రపంచంలో జరుగుతున్న గందరగోళాలన్నిటికీ కాళోజీ కలం స్పందించింది.. కవితల తూటాలు చిందించింది. అడ్డమైన మురికినంతా తన్నేసే జీవనది.. ఆయన 'గొడవ'.

'అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినోడు
నాకు ఆరాధ్యుడు'
– కాళోజీ

'ఉదయం కానేకాదనుకోవడం నిరాశ.. ఉదయించి అట్లాగే ఉండాలనుకోవడం దురాశ' అంటూ మార్గనిర్దేశనం చేశారు ప్రజాకవి కాళోజీ. ఆయన కలం అంకుశం.. అవనిపై అవకతవకలకు ఆయన మనసు కకావికలమైంది. వందేళ్ల కిందట పుట్టి వెయ్యేళ్లకు సరిపడా మెదళ్లను కదలించిన ఈ శతాబ్దపు మేటి కవి మన కాళోజీ. నిజాం ముష్కర పాలనకు, సమాజంలోని కుళ్లు, కుతంత్రాలకు వ్యతిరేకంగా గళమెత్తారు కాళోజీ. లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ అస్తమించినప్పుడు 'పుటుక నీది చావు నీది.. బతుకంతా దేశానిది..' అంటూ కాళోజీ నివాళి అర్పించారు. ఈ వాక్యాలు కాళోజీకి సరిగ్గా సరిపోతాయి. ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అంటూ ఆలోచనాజ్యోతులను వెలిగించిన కాళోజీ.. 2002 నవంబర్ 13న అస్తమించారు.



శ్రీనివాస్ కట్కం

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.